PRAJAPAKSHAM

తాతలనాటి కథలు
రూ।। 70/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం
ఎడిటర్ : కె.శ్రీనివాస్‌రెడ్డి

2024, మార్చి 18 సోమవారం
హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 270, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00
Published from: Hyderabad
Khammam, Karimnagar, Mahabubnagar




# ప్రభుత్వాన్ని పడగొడితే ఊరుకుంటామా?

కెసిఆర్ నాటిన గంజాయి మొక్కలను ఏరివేస్తాం

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మొత్తంగా రూ.9లక్షల కోట్ల అప్పు

చట్టబద్ధంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

ధరణి పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తేనే తప్పులు, అవినీతి వెలికి

''మీట్ ది మీడియా''లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని బిఆర్ఎస్, బిజెపి నేతలు పదే పదే చెబుతున్నారని, తమ ప్రభుత్వాన్ని పడగొడితే చూస్తూ ఊరుకుంటామా? అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పిసిసి అధ్యక్షుడిగా ఇక తన రాజకీయాన్ని చూపిస్తానని, ఇప్పుడే 'గేట్లు'(పార్టీ చేరికలు) తెరిచానని, కుక్క కాటుకు చెప్పు దెబ్బ అని పెద్దలు చెప్పారని, తమ వద్దకు వస్తే కొట్టకుండా ఊరుకుంటామా? అని వ్యాఖ్యానించారు. కెసిఆర్ నాటిన గంజాయి మొక్కల వాసన ఇంకా వెదజల్లుతోందని, ఈ మొక్కలను పికే పనిలో ఉన్నానని, గంజాయి మొక్కలే లేకుండా చేస్తానని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మొత్తంగా రూ.9లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. కెసిఆర్ పాలనలో అవినీతి తరువాయి 2లో

## జర్నలిస్టుల ఇంటి స్థలాలు, హెల్త్‌కార్డు సమస్య పరిష్కరిస్తాం

జవహర్‌లాల్ నెహ్రూతో పాటు ఇతర హౌసింగ్ సొసైటీలకు చెందిన ఇంటి స్థలం, కార్పొరేట్ హెల్త్ ఇన్సూరెన్స్ సమస్యను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. ఇంటి సమస్యల అంశంపై జవహర్‌లాల్ నెహ్రూ తో పాటు ఇతర సొసైటీలు తెలంగాణ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డితో చర్చించాలని, అలాగే సమాచార, పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సమావేశమై ఆ సమస్యలకు పరిష్కార సూచనలతో తమ వద్దకు వస్తే వాటిని పరిష్కరించే బాధ్యత తీసుకుంటామని రేవంత్‌రెడ్డి జర్నలిస్టులకు భరోసానిచ్చారు. 'తమ సొసైటీకి నాటి కాంగ్రెస్ తరువాయి 2లో

## నిజాంకు నకలు కె. చంద్రశేఖర్‌రావు

1948 సెప్టెంబర్ 17కు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని, అలాగే 2023 డిసెంబర్ 3కు చరిత్రలో అంతే ప్రాముఖ్యత ఉన్నదని రేవంత్ రెడ్డి వివరించారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాచరిక పాలన అంతమైందని, 2023 డిసెంబర్ 3న కెసిఆర్ పాలన అంతమైందని వివరించారు. వారసత్వాన్ని తలపై రుద్దాలని చూసినప్పుడు తెలంగాణ సమాజం ఏకమైందని, వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ఇన్నాళ్లు కవులు,కళాకారులను కెసిఆర్ తన గడీలో బంధించారని,దొరగారి భుజకీర్తులను సాగించాలని తెలంగాణ సాంస్కృతిక చరిత్రపై దాడి చేశారన్నారు.వంద రోజుల ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛను అందించామన్నారు.

# 'మోడీ గ్యారంటీ' ధనవంతులకే...

దేశ ప్రజలు కేంద్రంలోని బిజెపి సర్కారును వ్యతిరేకిస్తున్నారు

'ఇండియా' కూటమి నేతలు వ్యాఖ్య



ముంబయి: 'మోడీ గ్యారంటీ' కేవలం ధనవంతులకే పరిమితమని, పేదల కోసం, దేశ ప్రజల కోసం ఆయన చేస్తున్నదని ఏమీ లేదని ముంబయిలోని స్థానిక శివాజీ పార్క్‌లో జరిగిన ర్యాలీలో 'ఇండియా' కూటమిలోని వివిధ పార్టీలకు చెందిన నేతలు ధ్వజమెత్తారు. కేంద్రంలోని బిజెపి సర్కారును దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ర్యాలీలో మాట్లాడుతూ, మోడీ విధానాలు కేవలం కార్పొరేట్ వర్గాలకు మాత్రమే అనుకూలంగా ఉంటాయని విమర్శించారు. ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల వంటి కీలక సమస్యలను మీడియా ప్రస్తావించడం లేదు కాబట్టి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపట్టినట్టు చెప్పారు. 'ఇవిఎంలు, ఇడి, సిబిఐ, ఐటి లేకుండా మోడీ లోక్‌సభ ఎన్నికలను గెలవలేరని వ్యాఖ్యానించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. కాగా, తమ పోరు ప్రధాని నరేంద్ర మోడీపైకాదని, ఆయను అనుసరిస్తున్న విధానాలనే వ్యతిరేకిస్తున్నామని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) నాయకుడు, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజశ్వి యాదవ్ అన్నారు. అబద్ధాలను తయారు చేసి, వాటిని ప్రచారం చేసే ఫ్యాక్టరీగా ప్రధాని నరేంద్ర మోడీని ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడం బిజెపికి అలవాటని పేర్కొన్నారు. ముంబయి నుంచే ఒకప్పుడు మహాత్మా గాంధీ 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చారని, ఇప్పుడు 'ఇండియా' కూటమి నేతలంతా బిజెపిని ఓడించేందుకు కంకణం కట్టుకోవాలని ఎన్‌సిపి నాయకుడు శరద్ పవార్ పిలుపునిచ్చారు. ప్రజలు ఏకమైతే, నిరంకుశపాలన అంతమవుతుందని శివసేన (యుబిటి) నాయకుడు ఉద్ధవ్ థాక్రే వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని ప్రధాని మోడీ అంటున్నారని, రాజ్యాంగ స్వరూపాన్ని మార్చడానికే ఆయన ఇన్ని సీట్లను ఆశిస్తున్నారని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు. రాహుల్ తరువాయి 8లో



# బిఆర్ఎస్‌కు భారీ షాక్

కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్

పార్టీ తీర్థం పుచ్చుకున్న చేవెళ్ల సిట్టింగ్ ఎంపి రంజిత్‌రెడ్డి

ఇప్పటికే కవిత అరెస్ట్‌తో సంక్షోభంలో బిఆర్ఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటి నుంచి బిఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. దీంతో బిఆర్ఎస్ పార్టీ తీవ్రమైన సంక్షోభ సుడిగుండంలో చిక్కుకుంది. పార్టీ మనుగడపై పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు కవిత అరెస్ట్‌తో సతమతమవుతున్న అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు మరోవైపు ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పార్టీని వీడుతుండటం కలవరానికి గురి చేస్తోంది. వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలతో కెసిఆర్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కెసిఆర్ కుమార్తె కవితను ఇడి అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెల్సిందే. మరోవైపు పార్టీకి చెందిన సీనియర్ నేతలు బిఆర్ఎస్‌ను వీడిపోతున్నారు. తాజాగా ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్, చేవెళ్ల ఎం.పి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ తరువాయి 2లో

# ఇయు అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, వెంకన్న

36 మందితో కార్యనిర్వహణ సమితి ఎన్నిక




ప్రజాపక్షం/ ఖమ్మం

టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్. బాబు, ఈదురు వెంకన్న ఎన్నికయ్యారు. ఖమ్మం నగరంలోని టిఎన్‌జివోస్ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభలలో చివరి రోజు నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె. పద్మాకర్, అధ్యక్షుడిగా ఎస్. బాబు, కార్యనిర్వహక అధ్యక్షుడిగా ఎండి అహ్మద్ అలీ, ఉపాధ్యక్షుడిగా ఎం. వెంకట్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఈదరు వెంకన్న, ఉప ప్రధాన కార్యదర్శులుగా పాటి అప్పారావు, జె. రాఘవులు, ప్రచార కార్యదర్శిగా సి. శంకర్, కోశాధికారిగా జిడి ప్రసాద్ ఎన్నికయ్యారు. మొత్తం 36 మందితో ఎంప్లాయిస్ యూనియన్ తరువాయి 2లో

# బాండ్ల ద్వారా బిజెపికి రూ. 6,986 కోట్లు

ఇదే అత్యధికం... రెండో స్థానంలో తృణమూల్ కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్) ద్వారా అత్యధికంగా లాభపడిన పార్టీ బిజెపి. భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) తన వెబ్‌సైట్‌లో ఉంచిన వివరాలను అనుసరించి, బిజెపికి బాండ్ల ద్వారా రూ. 6,986.5 కోట్ల రూపాయలు లభించాయి. రెండో స్థానాన్ని పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) దక్కించుకుంది. ఆ పార్టీ బాండ్ల ద్వారా రూ. 1,397 కోట్లు పోగు చేసుకుంది. జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు రూ. 1,334 కోట్లు, భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)కు రూ. 1,322 కోట్లు చొప్పున బాండ్ల రూపంలో విరాళాలు సమకూరాయి. ఒడిశా తరువాయి 2లో




## బిజెపి ఖాతాల్లోకి నల్లధనం

కాంగ్రెస్ ఆరోపణ.. మోడీ, అమిత్ షా జవాబుదారీ వహించాలని వ్యాఖ్య

ఎలక్టోరల్ బాండ్ల రూపంలో నల్లధనాన్ని తన ఖాతాలో చేరేందుకు బిజెపి కుట్ర పన్నిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ బాండ్ల కుంభకోణానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జవాబుదారీ వహించాలని డిమాండ్ చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆదాయపన్ను శాఖ అధికారులు తమ పార్టీ ఖాతాలను స్తంభింపచేయడం ద్వారా తమపై 'పన్ను ఉగ్రవాదం', 'సర్జికల్ స్ట్రయిక్'కు పాల్పడిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' పోస్టులో విమర్శించారు. పరస్పర తరువాయి 2లో

## పూర్తి సమాచారం ఇప్పించండి

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్

ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్) పూర్తి సమాచారం ఇప్పించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి, దీనిని రాజ్యాంగ విరుద్ధమైనదిగా సుప్రీం కోర్టు ప్రకటించే వరకూ జారీ అయిన అన్ని బాండ్ల వివరాలను తెసుకునే హక్కు ప్రజలకు ఉందని సిటిజన్స్ రైట్స్ ట్రస్ట్ (సిఆర్‌టి) తన పిటిషన్‌స్పేర్కొంది. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018 మార్చి 1న ప్రారంభమైంది. ఈ బాండ్ల జారీని సవాలు చేస్తూ పలు పిటిషన్లు దాఖలుకాగా, సుప్రీం కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన చారిత్రక తీర్పున వెల్లడించిన విషయం తెలిసిందే. 2019, ఏప్రిల్ 12 నుంచి 2024, ఫిబ్రవరి 15 వరకూ జారీ చేసిన బాండ్ల తరువాయి 2లో



# కేజ్రీవాల్‌కు మరోసారి ఇడి సమన్లు

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు రెండు సమన్లు జారీ చేశారు. ఢిల్లీ జల మండలిలో చోటుచేసుకున్న అవకతవకలకు సంబంధించిన కేసులో మార్చి 18న ఇడి కేంద్ర కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని తరువాయి 2లో

# 4 రోజులు వర్ష సూచన

బుధవారం వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎండలు మండిపోతున్న వేళ భారత వాతావరణ విభాగం హైదరాబాద్ కేంద్రం అధికారులు చల్లటి కబురు చెప్పారు. రానున్న నాలుగు రోజులు తెలంగాణకు వర్ష సూచన చేశారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లో ఆదివారం వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించారు. ఇక సోమవారం ఆదిలాబాద్, తరువాయి 2లో

## రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఓట్ల లెక్కింపు తేదీ మార్పు

జూన్ 2వ తేదీనే అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

07

## పెట్రో ధరల్లో ఎపి టాప్

తర్వాతి స్థానాల్లో కేరళ, తెలంగాణ రాష్ట్రాలు

# ఎన్నికలపై పార్టీల నజర్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలు

రెండు చోట్లా మహిళా ఓటర్లదే పైచేయి




ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి

కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకున్నది. దీంతో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఆయా లోక్‌సభ స్థానాలలో పోటీ చేసేందుకు పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు బిఆర్ఎస్, బిజెపి, వామపక్షాలు తదితర పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతూనే అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ముమ్మరం చేస్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఒకడుగు ముందు ఉండగా మిగిలిన పార్టీలు వివిధ కార్యక్రమాల పేరుతో జనం వద్దకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ నియోజక వర్గాలలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికకు కసరత్తు మొదలు పెట్టింది. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం తరువాయి 2లో

## బాబు, వెంకన్న

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకన్నలు మాట్లాడుతూ టిఎస్ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నూతన కమిటీ పని చేస్తుందన్నారు. ఇప్పటికే ఎంప్లాయిస్ యూనియన్ పక్షాన కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చర్చలు, సంప్రదింపులు జరుపుతామని, పరిష్కారం కానప్పుడు పోరాటం తప్పదన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది డిఎలు బకాయి ఉందని వాటిని వీలైనంత త్వరలో చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు.

**ముగిసిన మహాసభలు :**

రెండు రోజుల పాటు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. రాష్ట్ర నలు మూలల నుండి ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో 95 డిపోలకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతినిధులు పాల్గొనడం గమనార్హం. మహిళా కార్మికులు హెచ్చు సంఖ్యలో పాల్గొన్నారు. మహాసభలలో చర్చల్లోనూ మహిళా కార్మికులు పాల్గొని తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకు రావడంలోనూ, తీర్మానాల విషయంలోనూ ముందు వరుసలో నిలిచారు. విజయవంతంగా మహాసభలను నిర్వహించిన ఆహ్వాన సంఘానికి, ఏఐటియుసికి కార్మిక ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మరోసారి ఇడి సమన్లు

(మొదటి పేజీ తరువాయి)

అందులో పేర్కొన్నారు. అంతకముందు శనివారం సాయంత్రం ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మనీలాండరింగ్‌కు సంబంధించి కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేశారు. అందులో మార్చి 21న విచారణకు హాజరుకావాలని తెలిపారు. ఈ కేసులో సమన్లు ఇవ్వడం వరుసగా తొమ్మిదోసారి. గతంలో ఇదే కేసులో ఎనిమిది సార్లు సమన్లు జారీ చేయగా, వాటికి ఆయన స్పందించకపోవడంతో ఢిల్లీ కోర్టులోఇడి రెండు ఫిర్యాదులు నమోదు చేసింది. దీనిపై శనివారం విచారణ సందర్భంగా కేజ్రీవాల్ కోర్టు ముందు హాజరయ్యారు. చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. అదే రోజే సాయంత్రం, మరుసటి రోజు ఆయనకు సమన్లు జారీ చేయడంపై ఆప్ వర్గాలు కేంద్రంపై విమర్శలు చేస్తున్నారు. ఢిల్లీ జలమండలికి సంబంధించిన కేసులో తప్పుడు కేసు నమోదు చేశారని ఢిల్లీ మంత్రి అతిశీ ఆరోపించారు. ''ఢిల్లీ జలమండలి బోర్డు కేసు గురించి ఎవరికీ తెలియదు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయలేమని భావించిన కేంద్రం మరో తప్పుడు కేసుతో ఆయన్ను ఇబ్బంది పెట్టాలని చూస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన్ను ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకు బిజెపి పన్నిన కుట్రలో భాగమే తాజా సమన్లు. గతంలో కూడా కేజ్రీవాల్‌ను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేసేందుకునే ఢిల్లీ మద్యం కేసులో సమన్లు జారీ చేశారు'' అని విమర్శించారు.

## 4 రోజులు వర్ష సూచన

(మొదటి పేజీ తరువాయి)

కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందన్నారు. మంగళవారం నాడు సిద్దిపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కూడా వానలు పడతాయని తెలిపారు. రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, నల్లగొండ, భూపాలపల్లి, మంచిర్యాల, ములుగు, వరంగల్, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాలకు బుధవారం వర్ష సూచన ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేస్తున్నట్టు హెచ్చరించారు. వర్షాల ప్రభావంతో వచ్చే నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మినహా అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలలోపే నమోదవుతాయనే అంచనాగా ఉందన్నారు.

## హెల్త్‌కార్డు సమస్య పరిష్కరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ హయంలోనే స్థలాన్ని కేటాయించారని, దీనికి సంబంధించిన చిక్కుముడులు కూడా విప్పుకుని, ప్రభుత్వం వైపు పెండింగ్‌లో ఉన్నదని,చాలా మంది దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నారని, సుమారు 70 మంది చనిపోయారని, ఈ సొసైటీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని' జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు సిఎం రేవంత్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న కార్పొరేట్ హెల్త్ ఇన్సూరెన్స్‌పై సరైన విధంగా చర్యలు తీసుకుం టామన్నారు. సరైన వేదిక వద్దకు కాకుండా, తన వద్దకు వస్తే, చూస్తాను, చేస్తాను అనడం తప్ప పరిష్కారం లభించబోదని, ఈ సమస్యపై తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వద్ద చర్చించాలని సిఎం స్పష్టం చేశారు.

## బిజెపి ఖాతాల్లోకి నల్లధనం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనాలు (క్విడ్ ప్రొకో) పొందేందుకు కార్పొరేట్ శక్తులతో బిజెపి ప్రయత్నించిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) నిష్పాక్షికంగా, తటస్థంగా వ్యవహరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. '2018లో కేంద్రం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్) ఒక ప్రభుత్వం నడుపుతున్న అతిపెద్ద దోపిడీ ర్యాకెట్' అని జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ 'హై రిస్క్'గా గుర్తించిన 19 కంపెనీలు ఏకంగా రూ. 2,717 కోట్లకు ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశాయని గుర్తుచేశారు. వీటిలో 18 కంపెనీల పేర్లు ఆ తర్వాతి 'హైరిస్క్' కంపెనీల జాబితాలో కనిపించలేదని పేర్కొన్నారు. క్విడ్ ప్రొకోకు ఇదే నిదర్శమని అన్నారు. కాంగ్రెస్‌కు కూడా విరాళాలు అందాయన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వాదనను తోసిపుచ్చారు. సిబిఐ లేదా ఇడి లేదా ఆదాయపు పన్ను కాంగ్రెస్ ఆధీనంలో లేవని అన్నారు, పోర్టులు, హైవేలు వంటి పెద్ద కాంట్రాక్టులు ఇచ్చే అధికారం తమ పార్టీకి లేదన్నారు. దేశాల్లోని నల్లధనాన్ని వెలికితీసి ప్రతి భారతీయుడి ఖాతాలో 15 లక్షల రూపాయలు జమ చేస్తానని ప్రధాని హామీ ఇచ్చారని, కానీ, ఇప్పుడు నల్లధనం మొత్తాన్ని బిజెపి ఖాతాల్లోకి మళ్లించేందుకు ప్రధాని కుట్ర పన్నినట్లు కనిపిస్తోందని జైరామ్ రమేశ్ తన పోస్టులో విమర్శించారు.

## పూర్తి సమాచారం ఇప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను వెల్లడించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)ని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించింది. వాటి వివరాలను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి ఇవ్వాలని కూడా స్పష్టం చేసింది. అయితే, 2019, ఏప్రిల్ 12కి ముందు, అంటే, 2018 మార్చి 1 మార్చి నుంచి రూ. 4,002 కోట్ల విలువైన 9,159 బాండ్లను ఎస్‌బిఐ అమ్మిందని, ఆ వివరాలను ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని సీనియర్ సిఆర్‌టికి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ న్యావాది విజయ్ హన్సారియా, న్యాయవాది స్నేహ కలిత తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. తాము కోరిన కాలానికి, ఎస్‌బిఐ అమ్మిన బాండ్లు, వాటిలో రీడీమ్ చేసిన బాండకు సంబంధించిన ఆల్ఫాన్యూమరిక్ నంబర్, కొనుగోలు తేదీ, డినామినేషన్, దాతలు, పార్టీల పేర్లతో సహా ఇసిఐకి సమర్పించాల్సిందిగా ఎస్‌బిఐని ఆదేశించాలని ఆ పిటిషన్‌లో కోరారు. మొత్తం బాండ్లలో 76 శాతం మాత్రమే ఇసిఐ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్నాయని, మిగతా 24 శాతం బాండ్ల వివరాలు ఓటర్లకు తెలియవని తెలిపారు. 'ఎలక్టోరల్ బాండ్ల పథకంతోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951, కంపెనీల చట్టం, 2013, ఆదాయపు పన్ను చట్టానికి చేసిన సవరణలను సుప్రీం కోర్టు కొట్టివేసింది. 1961 ఆర్థిక చట్టం, 2017 ప్రకారం, మొత్తం కాలానికి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు నిధులను తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉంది' అని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. అందుకే ఇబిఎస్‌పై పూర్తి సమాచారాన్ని ఇసిఐకి అందచేసేలా ఎస్‌బిఐకి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## తెలంగాణ రాజకీయాల్లో
# బిఆర్ఎస్ పని అయిపోయింది



జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో బిఆర్ఎస్ పని అయిపోయిందని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. పదేళ్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడటంతో పాటుగా నిరంకుశ, నియంతృత్వ పాలనతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కల్వకుంట్ల కుటుంబ రాజకీయాలను ప్రజలు ద్వేషించుకుంటున్నారన్నారు. బిఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంఎల్‌ఎ ఆరూరి రమేశ్‌కు కండువా కప్పి బిజెపిలోకి కిషన్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత అరెస్ట్‌తో బిజెపికి సంబంధం లేదన్నారు. కవిత పిఏ, బినామీలు అప్రూవర్‌గా మారి లిక్కర్ స్కామ్ వివరాలను ఇస్తున్నారని తెలిపారు. బినామీలతో లిక్కర్ వ్యాపారాలు చేసి, తమ పార్టీపై విమర్శలు గుప్పిస్తారా? అని మండిపడ్డారు. అడ్డగోలుగా ప్రజాధనాన్ని దోచుకోవడం, సిగ్గులేకుండా మద్యం కుంభకోణంలో భాగస్వామి కావడం పట్ల పశ్చాత్తాప పడాల్సింది పోయి, బిజెపి మీద, మోడీ మీద విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని కవిత చెప్పాలన్నారు. సెల్‌ఫోన్‌లను ధ్వంసం చేసి, ఆధారాల్లేకుండా చేసేందుకు ప్రయత్నించిన కవిత తీరును చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసేందుకు కవిత లిక్కర్ కుంభకోణంలో దూరారా? దీని వల్ల తెలంగాణ ప్రజలకు ఏమైనా లాభం జరిగిందా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి విజయ రామారావు, మాజీ ఎంఎల్‌ఎ ధర్మా రావు, కొండేటి శ్రీధర్, జైపాల్, పొన్నాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

### పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డిపిఆర్
## ఆలస్యంగా సమర్పించడంతో రాష్ట్రానికి అన్యాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిటేల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను (డిపిఆర్) గత రాష్ట్ర ప్రభుత్వం 2022,సెప్టెంబర్ 13న అందజేసిందని కేంద్ర జలశక్తి తెలిపింది. ఈ మేరకు సీనియర్ జర్నలిస్టు ఇనగంటి రవి కుమార్ దాఖలు చేసిన సమాచార హక్కు చట్టంలో కేంద్రం స్పష్టం చేసింది. డిపిఆర్‌ను ఆలస్యంగా సమర్పించడంతో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఇనగంటి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.2023 అక్టోబర్ సంవత్సరంలో కృష్ణా వాటర్ డిస్పూట్స్ ట్రిబ్యునల్‌కు కేంద్రం ఇచ్చిన అదనపు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌తో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కావాల్సిన నీటి కేటాయింపులను తెచ్చుకునే అవకాశాన్ని రాష్ట్రం కోల్పోయిందని పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణకు గుండెకాయ లాంటి పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించి డిపిఆర్ ను పంపించేందుకు గత ప్రభుత్వానికి 8 సంవత్సరాల కాలం పట్టిందని, ఈ ప్రాజెక్ట్ కు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. తెలంగాణ, ఎపి రాష్ట్రాలకు ప్రాజెక్ట్‌ల వారిగా నీటి కేటాయింపులు చేయాలని, బచావత్ ట్రిబ్యునల్ పరిధిలోని ప్రాజెక్ట్‌లకు కేటాయింపులు చేపట్టాలని 2015 సంవత్సరంలోనే కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

# సార్వత్రిక ఎన్నికలు ఆషామాషీ కాదు

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజస్వామిక దేశమైన భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడం ఆషామాషీ కాదు. ఓటరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం ఒకవైపు, శాంతియుతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయడం మరోవైపు భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ముందు ఉన్న ప్రధాన బాధ్యతలు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు వేయడానికి వీలుగా జల, వాయు, భూతల మార్గాలని వినియోగించక తప్పదు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన తేదీలు, ఇతరత్రా వివరాలను కేంద్ర ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ ఈనెల 16వ తేదీ, శనివారం ప్రకటించినప్పటికీ, ఇందుకు సంబంధించిన కసరత్తు ఇంతకు ముందే ప్రారంభమైంది. కనీసం ఏడాదిన్నర ముందుగానే అధికారులు, పోల్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం వంటి ప్రాథమిక పనులు మొదలపోయాయి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పరికరాలతో పాటు, ఇవిఎంలు, చెరగని ఇంకు సరఫరాను ఇసిఐ వేగవంతం చేసింది. రాజీవ్ కుమార్ ప్రకటనను అనుసరించి, దేశంలో, 18వ లోక్‌సభకు ఎన్నికలు ఏప్రిల్ 19న ప్రారంభమవుతాయి, ఆ తర్వాత ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, చివరిగా జూన్ 1న తదుపరి దశల్లో పోలింగ్ జరుగుతుంది. మొత్తం 543 నియోజకవర్గాల్లో దాదాపు 97 కోట్ల మంది నమోదిత ఓటర్లు 10.5 లక్షల పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం దాదాపు 1.5 కోట్ల మంది పోలింగ్, భద్రతా సిబ్బంది, 55 లక్షల ఇవిఎంలు, నాలుగు లక్షల వాహనాలను వినియోగించనున్నారు. గత ఏడాది జూన్‌లో దేశవ్యాప్తంగా ఇవిఎంలు, పేపర్ ట్రయిల్ మెషిన్ల మొదటి స్థాయి తనిఖీలను ఇసిఐ దశలవారీగా ప్రారంభించింది. 'మాక్ పోల్స్‌ను నిర్వహించింది. మెషిన్లతో పార్టీలు సంతృప్తి చెందాయని నిర్ధారించడానికి మొదటి స్థాయి తనిఖీ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియలో 'మాక్ పోల్స్' అనేది ఓ భాగం. అటువంటి వ్యాయామాల కోసం ఇసిఐ ఒక క్యాలెండర్‌ను విడుదల చేస్తుంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలు కూడా ఈ క్యాలెండర్‌లో పొందుపరుస్తుంది. ఎఫ్ఎల్‌సిల సమయంలో, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, పేపర్ ట్రయిల్ మెషిన్లను తయారు చేసే రెండు ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్‌యు), భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్), ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఇసిఐఎల్) ఇంజనీర్లు సాంకేతికపరమైన లోపాలు ఏవైనా ఉన్నాయా? అనేది పరీక్షించి, నిర్ధారిసొత్తిరు. లోపభూయిష్ట యంత్రాలకు వీలుంటే మరమ్మతులు చేస్తారు. కుదరకపోతే, వాటి స్థానంలో కొత్త మషిన్లను తెప్పిస్తారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ రెండు యంత్రాలను తనిఖీ చేసేందుకు 'మాక్ పోల్' కూడా నిర్వహిస్తారు. అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నప్పుడు, పోల్ ప్యానెల్ రాష్ట్ర స్థాయిలోని అధికారులతో చర్చించి, వారి అవసరాలను తెలుసుకొని, సానుకూలంగా స్పందిస్తున్నది.

కాగా, ఎన్నికల నిర్వహణ సజావుగా సాగడానికి వీలుగా అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రధాన ఎన్నికల అధికారులను సెషన్లకు ఆహ్వానిస్తారు. ఇక్కడ వారికి అన్ని విభాగాల్లోనూ అవగాహన కల్పిస్తారు. ఎన్నికల నిర్వహణ, ఓటరు అవగాహన, ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే దుష్ప్రవర్తనలను నివారించడం వంటి అంశాలను నేర్పుతారు. సీనియర్లు తమతమ అనుభవాలను ఇతరులతో పంచుకుంటారు. అంతేగాక, ఎన్నికల నిర్వహణలో కీలకమైన భద్రతా సిబ్బంది మోహరింపు, రైళ్లు, పడవలు, వాహనాలు, హెలికాప్టర్ల ద్వారా వారిని కీలక ప్రాంతాలకు తరలించడం వంటి విషయాలను కూడా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు వివరిస్తారు. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేయడానికి వీలుగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, రైల్వే శాఖల సీనియర్ అధికారులతో ఇసిఐ సమావేశాన్ని నిర్వహిస్తుంది. భద్రత, పోలింగ్ సిబ్బందికి సౌకర్యవంతమైన బస, పరిశుభ్రమైన ఆహారం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంది. ఎన్నికలకు ముందు రాష్ట్రాలకు అవసరమైన సంఖ్యలో ఇవిఎంలను పంపడంలో ఇసిఐ బిజీగా ఉండగా, ఓటు వేసినందుకు గుర్తుగా వేలిపై వేసే చెరగని సీరాను సరఫరా చేసే ఆర్డరు పొందిన కర్నాటక ప్రభుత్వరంగ సంస్థ మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ తగిన మోతాదులో సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంటుంది. ఆ సీరాను దేశంలోని అన్ని బూత్‌లకు చేరేసేవే బాధ్యతను ఇసిఐ తీసుకుంటుంది. కనీసం 26 లక్షల సీరా బాటిళ్లను ఆ కంపెనీ అందచేయాల్సి ఉంటుంది. కర్నాటక ప్రభుత్వం 1962 నుండి కేవలం ఎన్నికల కమిషన్ కోసం సిరాను తయారు చేస్తోంది. ఒక 10 ఎంఎల్ సీసాలోని ఇంకు ద్వారా 700 మందికి గుర్తు వేయవచ్చు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సగటున 1,500 మంది ఓటర్లు ఉంటారు. అంటే ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రెండు సీసాల సీరా అవసరమవుతుంది. ఓటింగ్‌కు ముందు ఇవిఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారు. ఓటింగ్ ముగిసిన తర్వాత వాటిని తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకువస్తారు, అక్కడ వాటిని భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు జరిగే రోజున ఇవిఎంలను భారీ భద్రత మధ్య కౌంటింగ్ కేంద్రాలకు చేరుస్తారు. ఎన్నికలను ఎవరైనా హైకోర్టులో సవాలు చేస్తే, విచారణకు లేదా పరిశీలనకు వీలుగా ఓట్లను భద్రపరిచే యంత్రాలు, పేపర్ ట్రైల్ మెషిన్ స్లిప్‌లను కనీసం 45 రోజుల పాటు భద్రపరుస్తారు. పోల్ ఫలితాన్ని సవాలు చేయదలచుకున్న వారు 'ఎన్నికల పిటిషన్'ను ఆలోగా దాఖలు చేయాలి.

## బిజెపికి రూ. 6,986 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అధికార పార్టీ బిజెడి ఖాతాలోకి రూ. 944.5 కోట్లు వెళ్లాయి. డిఎంకె రూ. 656.5 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూలింగ్ పార్టీ వైఎస్ఆర్‌సిపి రూ. 442.8 కోట్లు చొప్పున బాండ్ల ద్వారా సేకరించాయి. జెడిఎస్ రూ. 89.75 కోట్లు స్వీకరిస్తే అందులో రూ. 50 కోట్లు కేవలం మేఘా కంపెనీ నుంచే రావడం విశేషం. అత్యధిక మొత్తంలో ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో మేఘాది రెండో స్థానం. లాటరీ కింగ్ శాండియాగో మార్టిన్‌కి చెందిన ఫ్యూచర్ గేమింగ్ ఏకంగా 1,368 కోట్ల రూపాయల విలువైన బాండ్లను కొన్నది. ఇందులో 37 శాతం డిఎంకె పార్టీకి అందచేసింది. ఆ పార్టీకి మేఘా నుంచి రూ. 105 కోట్లు, ఇండియా సిమెంట్స్ నుంచి రూ. 14 కోట్లు, సన్‌టివి నుంచి రూ. 100 కోట్లు చొప్పున లభించాయి. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన పార్టీల్లో టిడిపి (రూ. 181.35 కోట్లు), శివసేన (రూ. 60.4 కోట్లు), ఆర్‌జెడి (రూ. 56 కోట్లు), సమాజ్‌వాది పార్టీ (రూ. 14.05 కోట్లు), అకాలీదళ్ (రూ. 7.26 కోట్లు), ఎఐఎడిఎంకె (రూ. 6.05 కోట్లు), నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి/ రూ. 50 లక్షలు) ఉన్నాయి. బాండ్ల ద్వారా ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని సిపిఐ, సిపిఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ ఎంఎల్, ఎఐఎంఐఎం, బిఎస్‌పి ప్రకటించాయి.

**ఇసి వెబ్‌సైట్‌లో ఎలక్టోరల్ బాండ్లపై అదనపు సమాచారం**

ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన అదనపు సమాచారాన్ని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) తాజాగా తన వెబ్‌సైట్‌లో ఉంచింది. అందులో కొన్ని అదనపు వివరాలను అందించింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పొందిన విరాళాల వివరాలను వివిధ రాజకీయ పార్టీల నుంచి సీల్డ్ కవర్లలో అందాయని, వాటిని తెరవకుండా, తథాతథంగా సుప్రీం కోర్టుకు సమర్పించామని ఇసిఐ తెలిపింది. సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి, ఎస్‌బిఐ ఇచ్చిన వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నట్టు పేర్కొంది.

## బిఆర్ఎస్‌కు భారీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరోవైపు, చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి రంజిత్‌రెడ్డి పోటీ చేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఎంపి టికెట్ ఆఫర్ చేసినట్టు సమాచారం. వాస్తవానికి ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి భార్య సునీతారెడ్డి చేవెళ్ల నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే, మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమెకు మల్కాజిగిరి టికెట్ ఇస్తారని తెలుస్తోంది. దానం నాగేందర్ విషయానికి వస్తే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన మంత్రిగా పని చేశారు. 2018లో బిఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరే వరకు కూడా ఆయన బిఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని చెప్పారు. తాజాగా ఆ పార్టీని వీడి న 'దానం' హస్తం గూటికి చేరుకున్నారు. సికింద్రాబాద్ ఎంపి అభ్యర్థిగా దానంను బరిలోకి దించే అవకాశాలు ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవంతో పాటు నగరంలో వివిధ నియోజకవర్గాలలో నాగేందర్‌కు అనుచరగణం ఉండటంతో కాంగ్రెస్ ఎంపిగా బరిలో దించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. దానం నాగేందర్ సైతం సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఉత్సహకంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎన్నికలపై పార్టీల నజర్

(మొదటి పేజీ తరువాయి)

నుండి మాజీ కేంద్ర మంత్రి బలరామ్ నాయక్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించగా వరంగల్ నుండి పోటీ చేసే అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. కాగా బిఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు సిట్టింగ్ ఎంపిలలో మహబూబాబాద్ నుండి తిరిగి మాలోతు కవితను ప్రకటించగా వరంగల్ నుండి కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను ప్రకటించారు. దీంతో బిఆర్ఎస్ సిట్టింగ్ ఎంపి పసునూరి దయాకర్ కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు గడిచిన ఎన్నికలలో బిజెపి పెద్దగా ప్రభావం చూపక పోవడంతో కొంత వెనుకబడినా లోక్‌సభ ఎన్నికలలో గట్టి పోటీని ఇవ్వాలని చూస్తున్నది. ఈ సారి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని మహబూబాబాద్ నుండి బిఆర్ఎస్ మాజీ ఎంపి ప్రొఫెసర్ సీతారామ్ నాయక్‌కు అవకాశం ఇవ్వగా, వరంగల్ నుండి ఇంకా ప్రకటించలేదు. బిఆర్ఎస్ నుండి బిజెపిలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎంఎల్‌ఎ ఆరూరి రమేష్‌ను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఇక సిపిఐ సైతం వరంగల్ ఎస్‌సి రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాన్ని తమకు ఇండియా కూటమిలో భాగంగా ఇవ్వాలని కోరుతున్నది. దీంతో వరంగల్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలు ఉండగా, వీటిలో వరంగల్ ఎస్‌సి, సామాజిక వర్గానికి, మహబూబబద్ నియోజకవర్గం ఎస్‌టి సామాజిక వర్గానికి రిజర్వ్ చేయబడ్డాయి. ఈ రెండు నియోజక వర్గాల పరిధిలో గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో మెజారిటీ అసెంబ్లీ నియోజక వర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. వరంగల్ లోక్‌సభ పరిధిలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఒక్క స్టేషన్ ఘన్‌పూర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. ఇక మహబూబాబాద్ లోక్ సభ నియోజక వర్గం పరిధిలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో భద్రాచలం అసెంబ్లీ నియోజక వర్గంలో మాత్రమే బిఆర్ఎస్ గెలుపొందగా మిగిలిన ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. ఇదిలా ఉండగా, ఆ సారి కొత్త ఓట్ల నమోదు అనంతరం ఆయా నియోజకవర్గాలలో గణనీయంగా ఓట్లు పెరిగాయి. వరంగల్ లోక్ సభ స్థానం పరిధిలో మొత్తం 18,16,429 ఓటర్లు ఉండగా పురుషులు 8,92,527 మంది, మహిళలు 9,23,510 మంది,ఇతరులు 392 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే మహబూబాబాద్ లోక్‌సభా స్థానం పరిధిలో 15,26,998 మంది ఓటర్లు ఉండగా పురుషులు 7,45,554 మంది, మహిళలు 7,81,339 మంది, ఇతరులు 105 మంది ఓటర్లు ఉన్నారు. రెండు చోట్లా మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. అభ్యర్ధుల గెలుపులో మహిళలే ప్రధాన పాత్ర పోషించనున్నారు.

# పడగొడితే ఊరుకుంటామా?

(మొదటి పేజీ తరువాయి)

లక్షల కోట్లకు చేరిందని, దీనిపైన విచారణ కొనసాగుతోందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి హాల్‌లో సిఎం రేవంత్ రెడ్డితో ఆదివారం ''మీట్ ది మీడియా'' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మోడరేటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సిఎం రేవంత్‌రెడ్డి సమాధానమిస్తూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి వేల కోట్లకు చేరిందని, చట్టబద్ధంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. బతుకమ్మ, బోనాలు అనాదిగా తెలంగాణలో జరుపుకుంటున్న పండుగలని, ఎవరున్నా, లేకపోయిన బతుకమ్మ, బోనాల పండుగలు ఘనంగా జరుగుతాయని చెప్పారు. ధరణి పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే తప్ప, అవినీతి జరిగిందా లేదా అనే విషయం బయటపడదని, తప్పులకు కారణమైన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈటల రాజేందర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రంతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రవీన్ కుమార్‌కు టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాలని కోరినా, ఆయన తిరస్కరించారని వివరించారు.

**'తన్నీరు' ఆ కుర్చీలో ఎక్కువ సేపు ఉండవు**

డబ్బులు ముందు కట్టి జీరో కరెంటు బిల్లు తీసుకోవాలని ఒక అధికారి అంటున్నారని, గత సిఎం కెటిఆర్ నాటిన గంజాయి మొక్కల వాసనలు వెదజల్లు తున్నాయని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ముందుగా డబ్బు చెల్లించిన తర్వాతనే జీరో విద్యుత్ బిల్లు ఇవ్వాలని మేధావి నోటీసులు ఇచ్చారని, ఆ మేధావి గత ప్రభుత్వంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చినప్పుడు ఎందుకు ఈ ఆదేశాలు జారీ చేయలేదని మండిపడ్డారు. 'నీ ఇంటి పేరు తన్నీరు ఉన్నంత మాత్రాన నువ్వు పన్నీరు' కాలేవని అన్నారు. ఇటువంటి గంజాయి మొక్కలను పికె పనిలో ఉన్నానని, ఇప్పటికే కొన్ని గంజాయి మొక్కలు పీకేశామని, ఇంకా పీకాల్సినవి ఉన్నాయని, రోజుకు 18 గంటలు పని చేస్తానని, గంజాయి మొక్క అనేది లేకుండా చేస్తామన్నారు. 'తన్నీరు.. గుర్తు పెట్టుకో..నువ్వు కూడా ఆ కుర్చీలో ఎక్కువ సేపు ఉండవ'ని రేవంత్ రెడ్డి అన్నారు. తాము గతం కంటే ఎక్కువగానే విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ కొందరు ఉద్దేశపూర్వకంగా విఐపిల ప్రాంతాల్లో విద్యుత్ కోతలు చేస్తున్నారని, అటువంటి వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, అయినా అక్కడక్కడా ఇంకా ఉన్నారని, అటువంటి కొన్ని గంజాయి మొక్కలను ఏరివేస్తామన్నారు.

**ఇక గుట్టలు, బంగళాలు, లే అవుట్లకు రైతు భరోసా ఇవ్వం**

'రైతు భరోసా'పై ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 5 ఎకరాలు ఉన్న రైతుల వరకూ రైతుబంధు నిధులను వారి ఖాతాల్లో పడిందని, 62 లక్షల మంది రైతులకు రైతుబంధు సాయం అందిందని వివరించారు. ఇకపై గుట్టలు, రోడ్లు, బంగళాలు, లే అవుట్లకు రైతు భరోసా ఇవ్వబోమని వెల్లడించారు. ఏ ప్రభుత్వ పథకమైనా అందకపోతే అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, కానీ కోటీశ్వరులకు ప్రభుత్వ పథకాలను అమలు చేయబోమని తెలిపారు. రైతుబంధు దుర్వినియోగాన్ని ఆపుతామని, అర్హులందరికీ చెల్లిస్తామన్నారు. దుబారా తగ్గించడమే సంపద సృష్టించడమని, గత ప్రభుత్వం అడ్డగోలుగా జిఎస్‌టి మినహాయింపులు ఇచ్చిందని, కేంద్రం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేస్తామన్నారు.

**రాష్ట్రంలో 9 లక్షల కోట్ల అప్పులు**

రాష్ట్రంలో మొత్తంగా అన్ని కలిపి రూ. 9లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2014 సంవత్సరంలో రాష్ట్రం వచ్చిన మొదట్లో ఏడాదికి చెల్లించాల్సిన అప్పులు రూ.6 వేల కోట్లు ఉంటే, ఇప్పుడు రాష్ట్రం చెల్లించాల్సిన అప్పులు ఏడాదికి రూ.64 వేల కోట్లుగా ఉన్నదని వివరించారు. రాష్ట్రాన్ని నడిపించేందుకు ప్రతి నెలా రూ.11 వేల కోట్లు కావాలన్నారు. కేంద్రంతో చిల్లర తగాదాలకు వెళ్లబోమన్నారు. గవర్నర్ వ్యవస్థతో కూడా వివాదాలు కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం విషయంలో తమను వేలెత్తి చూపలేరన్నారు. గత ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని, వీటిపై న్యాయ, ఎసిబి, విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరుగుతోందని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో బోరెడ్డి అయోధ్య రెడ్డి, టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ హాజరయ్యారు.



## సిఎం రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం

### గంటన్నర ఆలస్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. అప్రమత్తమైన పైలెట్లు విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో విమానం అయిన కాసేపటికే సాంకేతిక సమస్య తలెత్తింది. విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదే విమానంలో రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ ఉన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ముగింపు సభలో పాల్గొనేందుకు వీరంతా ముంబైకి వెళ్తున్నారు. మరమ్మతుల అనంతరం విమానం ముంబైకు బయల్దేరింది. మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ నుంచి ముంబైకి వెళ్లే విమానంలో వీరంతా టికెట్లు బుక్ చేసుకున్నారు. ఈ విమానంలో మొదటి వరుసలో ఏ2 సీట్లో రేవంత్ కూర్చున్నారు. సాంకేతిక సమస్య కారణంగా విమానం గంటన్నర ఆలస్యం అయింది.



## సినీగేయ రచయిత చంద్రబోస్‌కు డాక్టరేట్

### ఘనంగా ఎస్ఆర్ ప్రథమ స్నాతకోత్సవం

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఎస్ఆర్ విశ్వవిద్యాలయం చాన్సలర్ ఏ.వరదారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్ర బుద్దే మాట్లాడుతూ, ఎస్ఆర్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి రావడం సంతోషంగా ఉందని, స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకుంటున్న విద్యార్థులు ఇంజనీర్లు, ఇన్నోవేటర్లు, సమస్యలు పరిష్కరించే వారని అన్నారు. ప్రొఫెసర్‌లు, యూనివర్సిటీ అందించిన సదుపాయాలతో ఇక్కడ చదివిన విద్యార్థులకు ఎన్నో నైపుణ్యాలు అలవడుతాయని, ఈ సందర్భంగా డిగ్రీలు తీసుకుంటున్న విద్యార్థులను అభినందించారు. కృత్రిమ మేదస్సు, మెషీన్ లర్నింగ్, డ్రోన్స్, రోబోటిక్స్, క్వంటం కంప్యూటింగ్ సాంకేతికతతో ప్రపంచం ముందుకు వెలుతున్నదని అన్నారు.2020 నూతన ఎడ్యుకేషన్ విధానంలో మార్పులు వస్తున్నాయని, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విధ్య వరకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. విలువ ఆధారిత విద్య లక్ష్యంగా నూతన ఎడ్యుకేషన్ పాలసీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారంతోఏన ఎస్ఆర్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నదని అన్నారు. ఈ స్నాతకోత్సవంలో ప్రో చాన్సలర్ ఏ.మధుకర్ రెడ్డి, రిజిష్ట్రార్ డక్టర్ అర్చన రెడ్డి, కాన్వోకేషన్ కమిటి చైర్మన్ డాక్టర్ సివి గురురావు, ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్ వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ గీత రచయిత కనుకుంట్ల చంద్రబోస్ కు అతిధులు డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్ చిత్రం ద్వారా గోల్డెన్ గ్లోబ్ , ఆస్కార్ అవార్డులు సాధించిన చంద్రబోస్‌ను వారు అభినందించారు.

## రేపు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలకు నగరా మోగిన నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) ఈనెల 19వ తేదీన సమావేశం కానుంది. పార్టీ మేనిఫెస్టోపై చర్చించనుంది. ఎన్నికల ప్రణాళికకు తుదిరూపు ఇవ్వనుంది. అదే విధంగా కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) కూడా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ఈనెల 19, 20 తేదీల్లో సమావేశం కానుంది. పార్టీ తరుపున పోటీలో దింపే మిగిలిన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయనుంది. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ వెల్లడించారు. మంగళవారం నాడు ఐదు గ్యారంటీలతో కూడిన ముసాయిదా మేనిఫెస్టోకు ఆమోదం తెలపనున్నట్లు ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 25 గ్యారంటీలతో కూడిన 'ఫైవ్ న్యాయ్'... 'భాగిదారి న్యాయ్', 'కిసాన్ న్యాయ్', 'నారి న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్', 'యువ న్యాయ్' అంశాలపై పోరాటం చేస్తుందన్నారు. ప్రతి న్యాయ్‌లోనూ ఐదు గ్యారంటీలు ఉండనున్నాయన్నారు. ఇప్పటికే వీటిని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించారన్నారు.

## ఆఫ్ఘనిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 21 మంది మృతి



**ఇస్లామాబాద్ :** ఆఫ్ఘనిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది మరణించగా.. 38 మంది గాయపడ్డారు. ఆదివారం హెల్మాండ్ ప్రావిన్స్‌లోని గెరాష్క్ జిల్లాలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానిక ట్రాఫిక్ నియంత్రణ అధికారి క్వద్రాతుల్లా తెలిపారు. కాందహార్ నుంచి హెరత్ ప్రావిన్స్‌కు వెళుతున్న బస్సును బైక్ ఢీ కొట్టింది. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఆయిల్ ట్యాంకర్‌పైకి దూసుకెళ్లింది. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ప్రజాపక్షం/కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం కొండగట్టు ముత్యంపేట నుండి మెట్‌పల్లి వైపు వెళ్తున్న శ్రీకాంత్, వేణు, వెంకటేష్ అనే ముగ్గురు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెంకటాపూర్ గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇంకొకరికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు గుర్తించి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సిపిఎస్ రద్దుపై రాజకీయ పార్టీల వైఖరేంటి?

### ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ అధ్యక్షులు ఇంద్ర శేఖర్ మిశ్రా







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల పెన్షన్ బడ్జెట్ పెరుగుతోందన్న సాకు చూపి 2004 నుండి ఉద్యోగులకు సిపిఎస్ విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమని ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ అధ్యక్షులు ఇంద్ర శేఖర్ మిశ్రా అన్నారు. హైదరాబాద్ కాచిగూడలోని టిఎస్, ఎస్‌టియు భవన్‌లో ఆదివారం ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు ఇంద్రశేఖర్ మిశ్రా మాట్లాడుతూ ఎంపి, ఎంఎల్‌ఎలుగా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ఐదు సంవత్సరాల పదవీకాలానికే పెన్షన్ పొందుతుండగా, మూడు దశాబ్దాలకుపైగా ప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసిన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్(సిపిఎస్) విధానాన్ని అమలు చేయడం సరైనది కాదన్నారు. దేశంలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు సిపిఎస్ రద్దుపై తమ వైఖరిని మేనిఫెస్టోలో తెలపాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా ఆదాయపన్ను స్లాబుల్లో ఎటువంటి మార్పు లేదన్నారు. ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజల నుండి పన్నులు ముక్కు పిండి వసూలు చేసి కార్పొరేట్, ధనిక వర్గాలకు రాయితీల రూపంలో ప్రభుత్వాలు దోచిపెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 8 లక్షల ఆదాయం ఉన్న వారిని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు పరిగణిస్తుండగా, రూ. 2.5 లక్షల ఆదాయం దాటిన వారి నుండి ఆదాయపు పన్ను చేయడం ఎట్లా న్యాయమవుతుందని ప్రశ్నించారు. కావున రూ.8 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలన్నారు. 80 సి సెక్షన్ కింద రూ. 3 లక్షల వరకు పొదుపునకు అవకాశం ఇవ్వాలన్నారు. అలాగే కొఠారీ కమిషన్ సిఫార్సుల మేరకు విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో ఆరు శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేంద్ర బడ్జెట్‌లో మూడు శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 11 శాతం మించడం లేదన్నారు. చాలా దేశాలు విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోనే అభివృద్ధి చెందాయానే విషయాన్ని పాలకులు విస్మరించడం శోచనీయమన్నారు. కార్యవర్గ సమావేశంలో సిపిఎస్ రద్దుపై అన్ని పార్టీలు మేనిఫెస్టో ద్వారా తమ వైఖరి తెలపాలన్నారు. ఆదాయ పన్ను పరిమితి రూ. 8 లక్షలకు పెంచాలని, కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల కేటాయింపు పెంచాలని తీర్మానం చేశారు. ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, సెక్రటరీ జనరల్ సదానందం గౌడ్, ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ అన్సారీ, ఆంధ్రప్రదేశ్ ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. సాయి శ్రీనివాస్, ఎం. రఘునాథ రెడ్డి, టిఎస్, ఎస్‌టియు అధ్యక్షులు పర్వత రెడ్డి, వివిధ రాష్ట్రాల నుండి కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

### సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ

## సంక్షోభాన్ని పరిష్కరిస్తాం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :-** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన కార్మిక సంఘం ఆసాముల సంఘం యజమానుల సంఘం నాయకులు చేనేత జౌళి శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలవడం జరిగింది వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణ కొరకు వెంటనే బకాయిలు విడుదల చేయాలని మరియు నూతన ఆర్డర్లు ఇవ్వాలని వారిని కూనంనేని కోరడం జరిగింది. ఈ విషయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ ఇప్పటికే ఈ విషయంపై మంత్రుల బృందం సమీక్ష జరిపిందని ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకు వెళ్ళామని ప్రస్తుతం సిరిసిల్ల పరిశ్రమ సంక్షోభంలోనికి వెళ్లడానికి ప్రధాన కారణం గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలేనని ఏది ఏమైనా కార్మికులను ఆదుకోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేపు లేదా ఎల్లుండి మళ్ళీ ముఖ్యమంత్రితో సమావేశం జరిపి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తుమ్మల హామీని ఇవ్వడం జరిగింది. వస్త్ర పరిశ్రమ సంక్షేమ పరిష్కారం కోసం స్థానిక నియోజకవర్గ ఇంచార్జ్ ఎకె మహేందర్‌రెడ్డి, కూనంనేని ఇప్పటికే ఈ విషయంపై రెండు మూడు సార్లు తన దృష్టికి తీసుకు వచ్చారని మంత్రి అన్నారు. మంత్రిని కలిసిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు లాల్ బహుట చేనేత పవన్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి, అజయ్, వేణు, ఎనగందుల రాజు, యజమానుల సంఘం నాయకులు మండల సత్యం, వెల్లండి దేవదాసు గోవిందు, రవి, బూట్ల నవీను తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల మధ్య సామరస్య వాతావరణాన్ని

## పెంపొందించడంలో మీడియాది కీలక పాత్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వివిధ దేశాల సాంస్కృతిక వైవిధ్యాన్ని అధ్యయనం చేసి పరస్పర అవగాహనతో ప్రజల మధ్య సామరస్య వాతావరణాన్ని పెంపొందించేందుకు మీడియా కీలక పాత్ర పోషిస్తున్నది. అందులో భాగంగా ఆగ్నేయాసియా, దక్షిణాసియా, యూరోప్, ఆఫ్రికా, అమెరికా దేశాల మీడియా ప్రతినిధులు మనదేశంలో పర్యటించేందుకు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పర్యటన షెడ్యూల్ రూపొందిస్తున్నది. మీడియా ఎక్స్చేంజ్‌లో భాగంగా ఈ నెల 17 ఆదివారం నుండి 20వ తేదీ వరకు 12 యూరప్ దేశాల కు చెందిన 22 మంది మీడియా ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించేందుకు హైదరాబాద్ చేరుకున్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో యూరోపియన్ మీడియా బృందానికి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం. హనుమంతరావు ఆదేశాల మేరకు రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు స్వాగతం పలికారు. ఈ మీడియా బృందం వెంట న్యూఢిల్లీ నుండి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారి చంద్రేశ్ సింగ్ వచ్చారు. యూరోప్‌లోని ఆల్బేనియా, క్రొయేషియా, సైప్రస్, చెక్ రిపబ్లిక్, ఈస్తోనియ, ఫిన్‌లాండ్, లాట్వియా, లిథుయేనియా, పోలాండ్, రొమేనియా, సెర్బియా, స్లోవేకియా దేశాలలోని పలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన 22 మంది ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఆదివారం గోల్కొండ కోట, శిల్పారామం ప్రాంతాలను సందర్శించారు. ఈ నెల 18న భారత్ బయోటెక్, టి హబ్, టి వర్క్స్, స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీలను, 19న ఐఎస్‌బి, రామోజీ ఫిల్మ్ సిటీలను సందర్శించనున్నారు.

## ప్రభుత్వానికి దన్నుగా ఆర్‌టిసి కార్మికులు

### వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### బకాయిపడ్డ డిఏ విడుదల చేయాలి

### ఫిట్‌మెంట్ పెంచాలి

### ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు విఎస్ బోస్




**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు దన్నుగా నిలిచారని మూడు నెలల్లో 22 కోట్ల మందిని గమ్య స్థానాలకు చేర్చారని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు విఎస్ బోస్ తెలిపారు. ప్రభుత్వానికి దన్నుగా నిలిచిన కార్మికుల పట్ల ఫిట్‌మెంట్, హెచ్‌ఆర్ఏ బకాయిపడ్డ డిఏ చెల్లింపులలో వివక్ష తగదని ఆయన అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఎస్. బాబు అధ్యక్షతన జరిగిన మహాసభలో బోస్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు కేవలం 21 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తర్వాత కార్మికులకు పని భారం విపరీతంగా పెరిగిందని సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచకుండానే ప్రయాణికుల సంఖ్య రెండు రెట్లు పెరిగిందని ఇది కార్మికుల పట్ల శాపంగా మారి విధి నిర్వహణ ప్రాణ సంకటంగా మారిందన్నారు. ఓవర్ లోడ్‌తో పాటు సమయపాలన లోపించిందని ఏ బస్సు ఎప్పుడు గమ్య స్థానం చేరుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ రంగంలోనైనా పోరాడేది కార్మికులకు అండగా నిలిచేది ఏఐటియుసి అనుబంధ సంఘాలేనని సింగరేణి, ఆర్టీసీ, బ్యాంకింగ్, బిఎస్ఎన్ఎల్ సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏఐటియుసి పోరాటాలు చారిత్రాత్మకమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని కార్మిక చట్టాలను సవరించిందని ఆయన తెలిపారు. కార్మిక పోరాటాలకు తలొగ్గి చట్ట అమలును తాత్కాలికంగా వాయిదా వేసింది కానీ లేకపోతే భారతీయ న్యాయ సంహిత చట్టం డ్రైవర్ల పాలిట శాపంగా మారేదని, భవిష్యత్తులో ఏ డ్రైవర్ కూడా తన వృత్తిని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడేదన్నారు. అధికారం కోల్పోయాక బిఆర్ఎస్‌కు కార్మికులు, కార్మిక చట్టాలు గుర్తుకు వస్తున్నాయని అంతకు ముందు కార్మిక సంఘాలంటేనే మండిపడ్డ నేతలకు ఇప్పుడు గుర్తుకు రావడం శోచనీయమన్నారు. మహాసభలలో 21 తీర్మానాలపై ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. తీర్మానాల అమలుకు సంబంధించి తొలుత ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని పరిష్కారం కాని పక్షంలో ఆందోళన బాట పట్టాలని తీర్మానించారు. రెండవ రోజు మహాసభలలో యూనియన్ సీనియర్ నాయకులు కె.పద్మాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఏఐటియుసి నాయకులు నర్సింహాం, యూనియన్, ఎఐటియుసి నాయకులు ఈదురు వెంకన్న, పాటి అప్పారావు, తోట రామాంజనేయులు, జే. రాఘవులు, జిడి ప్రసాద్, తిమ్మినేని రామారావు, కె. భాస్కర్, పిల్లి రమేష్, వెంకటరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గట్టమ్మ దేవాలయాన్ని దర్శించుకున్న హైకోర్టు చీఫ్ జస్టిస్



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జడ్జి ఆలోక్ ఆరాదే గట్టమ్మ దేవాలయాన్ని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజారుల సంఘం ఆధ్వర్యంలో హైకోర్టు చీఫ్ జడ్జి ఆలోక్ ఆరాదేకి ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజారులు శాలువాతో సన్మానించి ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైకోర్టు చీఫ్ జస్టిస్ గట్టమ్మ పూజారులయిన ఆదివాసీ నాయకపోడులు పూజారులతో మాట్లాడి గట్టమ్మ యొక్క విశిష్టత గురించి అమ్మవారి ప్రత్యేకత గురించి అడగడం జరిగింది. పూజారులు గట్టమ్మ తల్లి యొక్క విశిష్టతను చెబుతూ మేడారం చుట్టు ఏడు గట్టమ్మ తల్లులు ఉండడం జరిగిందన్నారు. మేడారం చుట్టు గట్టమ్మ తల్లుల్లో పెద్ద తల్లి ములుగు గట్టమ్మ అని అన్నారు. మేడారం వెళ్లే ప్రతి భక్తుడు గట్టమ్మ తల్లిని దర్శించుకున్న తర్వాత మేడారం వెళ్ళడం జరుగుతుందని అన్నారు. గట్టమ్మ తల్లికి భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుండి గట్టమ్మ పూజారులుగా ఆదివాసీ నాయకపోడ్‌లు పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆదివాసీ నాయకపోడులు పాండవుల వంశస్థులకు చెందిన వారని హైకోర్టు జడ్జికి వివరించారు. గట్టమ్మ తల్లి భరణి బెల్లం శాఖం అమ్మవారికి సమర్పిస్తే గట్టమ్మ తల్లి కోరిన కోరికలు తీర్చడంలో శక్తివంతమైన తల్లి అని అన్నారు. అదేవిధంగా ఆదివాసీ నాయకపోడ్ పూజారులకు జాకారం గ్రామ పంచాయతీకి చెందిన ప్రజలకు గట్టమ్మ పరిధి విషయంలో జరిగిన గొడవలను క్లుప్తంగా వివరించారు. అనంతరం హైకోర్టు జడ్జికి గట్టమ్మ విషయంలో గొడవ గురించి దరఖాస్తులు అందించారు. ఆదివాసీ నాయకపోడ్ ఆచార సంస్కృతి సంప్రదాయం ప్రకారం అమ్మవారి పూజలు నిర్వహిస్తూ దాదాపు 120 పైగా కుటుంబాలు జీవనంను కొనసాగిస్తున్నారు. మేడారం జాతర సమయంలో గట్టమ్మ ఎదురుపిల్ల పండగను లక్ష్మీ దేవర్ల పూజారులతో అంగరంగ వైభవంగా నిర్ణయించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టమ్మ ప్రధాన పూజారులు కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, ఆకుల పుల్లయ్య, చిర్ర రాజేందర్, అరిగెల సంజీవ, ఆకుల రఘు, కొత్త రవి, కొత్త రమేష్, కొత్త సారయ్య, మొట్లపల్లి సరోజ, చిర్ర సుభద్ర, అరిగెల రఘు, మండపు నరేష్, అరిగెల పూర్ణచందర్, చిర్ర మహేందర్, పూజారులు పాల్గొన్నారు.

**స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్‌పిలు**

ములుగు జిల్లా కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాదేకి గట్టమ్మ దేవాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సమ్మక్క సారలమ్మ ప్రతిమను అందజేసి స్వాగతం పలికారు. అదేవిధంగా రామప్ప దైవ దర్శనానికి వచ్చిన జడ్జికి ఎస్‌పి డాక్టర్ శబరీష్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

# ఖమ్మంకు నాలుగు కార్పొరేషన్ పదవులు

### వైరాకే దక్కిన రెండు

### గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్‌గా రాయల

### టిఎస్ఇడబ్ల్యుఐడిసి చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు






**ప్రజాపక్షం/ఖమ్మం:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా 37 కార్పోరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ గెజిట్ విడుదల చేసింది. 37 మందిలో ఖమ్మంజిల్లాకు చెందిన నలుగురికి అవకాశం దక్కింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాయల నాగేశ్వరరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు, హైదరాబాద్‌లో నివాసం ఉండే వైరాకు చెందిన నూతి శ్రీకాంత్, వైరాకు చెందిన నాయుడు సత్యనారాయణ ఛైర్మెన్ పదవి పొందిన వారిలో ఉన్నారు. డిసిసిబి ఛైర్మన్‌గా పని చేసిన మువ్వా విజయ్‌బాబు పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన వారు. తొలుత టిడిపి పార్టీలోను ఆ తర్వాత బిఆర్ఎస్‌లో ఉన్నారు. ఆ తర్వాత పొంగులేటితో పాటు బిఆర్ఎస్‌లో చేరి పొంగులేటికి విధేయునిగా పని చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఇల్లందు నియోజక వర్గ ఇంచార్జిగా పని చేశారు. విజయ్‌బాబుకు తెలంగాణ రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమించబడ్డారు. రాయల నాగేశ్వరరావు ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించిన రాయల నాగేశ్వరరావు తొలుత వామపక్ష రాజకీయాల్లో ఉన్నారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరి వివాద రహితుడిగా పేరొందారు. పలుసార్లు అవకాశం వచ్చి చేజారిన పార్టీ నిర్ణయాన్ని శిరసావహించారు. ఆయనకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమించబడ్డారు. వైరాకు చెందిన మల్లు భట్టి విక్రమార్క ప్రధాన అనుచరుడు నాయుడు సత్యనారాయణ కు తెలంగాణ చేతివృత్తుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బాధ్యతలను అప్పగించారు. ఆది నుంచి సత్యనారాయణ భట్టి అనుచరునిగా పేరొందారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నూతి వెంకట స్వామి కుమారుడు నూతి శ్రీకాంత్ గౌడ్‌కు బిసి కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమించబడ్డారు. వీరి కుటుంబం వైరా మండలం లక్ష్మిపురం గ్రామంలో కాంగ్రెస్ రాజకీయాలకు అంకితమైన కుటుంబం. గతంలో అనేక మంది ఈ కుటుంబం నుంచి కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. వారిలో వెంకటస్వామి కుమారుడు శ్రీకాంత్ విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ అనుబంధ ప్రజా సంఘాల్లో పని చేస్తూ వచ్చారు. యువజన కాంగ్రెస్ విద్యాదికుడైన శ్రీకాంత్ శక్తి అవార్డును అందుకున్నారు. మొత్తంగా జిల్లాకు నాలుగు కార్పోరేషన్‌లు దక్కడంతో కాంగ్రెస్‌లో మంచి జోష్ వచ్చింది. అయితే సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లో కొందరు కార్పోరేషన్ పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి రాకపోవడం పట్ల వారి అనుచరులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

**మంత్రులను కలిసిన రాయల**

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమించినందుకు రాయల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఆది నాయకత్వానికి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ముఖ్యమంత్రి పిఆర్‌వో వేం నరేందర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# సాహితీ విహారి


# ఆధునిక ఆఫ్రికన్ సాహిత్య పితామహుడు అచెబె

ఆధునిక ఆఫ్రికన్ సాహిత్యం గురించి చెప్పాలంటే, ముందుగా చినుప అచెబె పేరును ప్రస్తావించక తప్పదు. 1930 నవంబరు 16న తూర్పు నైజీరియా లోని ఒగిడిలో జన్మించిన అచెబె, 2013 మార్చి 21న తన 82వ ఏట తుదిశ్వాస విడిచాడు. అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రం, బోస్టన్ నగరంలో డేవిడ్ అండ్ మరియానా ఫిషర్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పని చేశాడు. 'ది ఆఫ్రికన్ ట్రియాలజీ', 'థింగ్స్ పాల్ అపార్ట్', 'నో లాంగర్ ఎట్ ఈజ్', 'యారో ఆఫ్ గాడ్', 'ఆల్సో, ఎ మ్యాన్ ఆఫ్ ది పీపుల్', 'ఏంథిల్స్ ఆఫ్ ది సవానా' వంటి రచనలు ఆయనకు విశేష పేరుప్రఖ్యాతులు ఆర్జించి పెట్టారు. ఆధునిక ఆఫ్రికన్ సాహిత్య పితా మహుడిగా పేరు సంపాదించిపెట్టాయి. అచెబె తండ్రి ఒక మిషన్ స్కూలు టీచరు. తల్లిదండ్రులు తమ సంప్రదాయ ఇబో సంస్కృతికి చెందిన విలువలను చిన్నతనం నుంచే ఆయన మస్తిష్కంలోకి జొప్పించారు. అప్పటి విక్టోరియా రాణి భర్త ప్రిన్స్ అల్బర్ట్ పేరుతో అచెబెకు తల్లిదండ్రులు అల్బర్ట్ అని పేరు పెట్టారు. కానీ, తర్వాతి కాలంలో అచెబెగానే ఆయన ప్రపంచ ప్రజలకు దగ్గరయ్యాడు. ఆఫ్రికన్ ప్రజల జీవనచిత్రాన్ని, అత్యంత సహజంగా, శక్తివంతంగా తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన మహా రచయితగా నిలిచిపోయాడు. అచెబె జన్మించిన ఇబో సంప్రదాయంలో కథలు చెప్పటానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. అది వారి జాతి సాంస్కృతిక ఆచారంలో మమేకమై ఉండేది. అందువల్ల అచెబెకి బాల్యంలో తల్లి, అక్క చెప్పే కథలు శ్రద్ధగా వినటం అలవాటైంది.

అచెబె 1944లో ఉముహాయియాలోని ప్రభుత్వ కళాశాలలో చేరాడు. ఆ తర్వాత వోలే సోయింకా, ఎలెచి అమడి, జాన్ ఒకీబో లాంటి ప్రముఖ నైజీరియా రచయితలందరి మాదిరిగానే ఇబడాన్ యూనివర్శిటీ కాలేజీలో చేరాడు. అక్కడ ఇంగ్లీషు, చరిత్ర, థియాలజీలను అభ్యసించాడు. అక్కడే తన ఇంగ్లీషు పేరును తిరస్కరించి చినువాగా మార్చు కున్నారు. 1953లో బిఏ పట్టా పుచ్చుకుని నైజీరియా బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీలో ఉద్యోగిగా చేరారు. ఆ కాలంలో ఆయన ఆఫ్రికాలోను, అమెరికాలోను పర్యటించారు. కొద్ది కాలం పాటు ఉపాధ్యాయుడిగా కూడా పనిచేశారు. 1960వ దశకంలో నైజీరియా విదేశాంగ శాఖలో డైరెక్టరుగా ఉంటూ 'వాయిస్ ఆఫ్ నైజీరియా'కు చీఫ్‌గా వ్యవహరించాడు. అచెబె రచనలు వివిధ భాషల్లోకి అనువదించబడ్డాయి. 1958లో రాసిన 'థింగ్స్ ఫాల్ ఎపార్ట్' నవల ఏకంగా 50 భాషల్లో అనువదించబడి, కోటి కాపీలకుపైగా అమ్ముడైంది. ఆఫ్రికాకు ఎవరి రచనలు కూడా ఇన్ని ప్రపంచ దేశాలకు చేరలేదు. 'థింగ్స్ ఫాల్ అపార్ట్' తర్వాత చాల కాలం వరకు ఆయన మరో ప్రధాన రచన చేయలేదు. 1987లో మాత్రమే ఆయన రాసిన 'యాంట్ హిల్స్ ఆఫ్ది సవన్నా' నవల వెలువడింది. అచెబె ఇంగ్లీషులోనే రచనలు చేసే వాడు. సుమారు 200కు పైగా విభిన్నమైన భాషలు మాట్లాడే ఆఫ్రికా ప్రజలందరికీ అవి చేరాలంటే ఇంగ్లీషులో రాయడమే ఉత్తమమైన మార్గమని ఆయన భావించాడు. విశేషమేమంటే ఎన్నో ప్రపంచ భాషల్లోకి తన రచనలను అనువదించడానికి అనుమతించిన అచెబె తన మాతృభాష ఈబోలోకి మాత్రం వాటిని అనువదించడానికి చాలాకాలం అంగీకరించలేదు. మూల భాషను వలసపాలకులు భ్రష్టు పట్టించారని, అలాంటి అపభ్రంశపు భాషలోకి తన రచనలను అనుమతించనని వ్యాఖ్యానించేవాడు. అచెబె తానుగా రచనలు చేయడంతో పాటు ఇతర ఆఫ్రికా రచయితలను కూడా బాగా ప్రోత్సహించాడు. క్రిస్టఫర్ ఒకీబె అనే రచయితతో కలిసి 1967లో ఆయన ఎంగుగోలో ఒక ప్రచురణ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత నైజీరియా విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ఫెలోగా నియమితులయ్యాడు. ఆ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పనిచేసి 1981లో పదవీ విరమణ చేశారు. 1971లో నైజీరియా నూతన రచయితల కోసం ఏర్పాటయిన ఒకీకె పత్రికకు సంపాదక బాధ్యతలు నిర్వహించాడు.


అమెరికా, మసాచుసెట్స్ విశ్వవిద్యాలయంలోనూ ఇంగ్లీషు ప్రొఫెసరుగా పనిచేశాడు. 1990వ దశకంలో ఆయన బార్డ్ కాలేజీలో ఫాకల్టీ సభ్యుడిగా ఉన్నాడు. ప్రఖ్యాత ప్రచురణ సంస్థ హీన్మెన్ వద్ద అచెబె ఆఫ్రికా రచయితల సిరీస్‌కు సంపాదకత్వం వహించాడు. ఆ సంస్థ ప్రచురించిన మొదటి రెండు పుస్తకాలు అచెబె నవలలే. ఇటీవల కాలం వరకు ఆ సిరీస్‌లో మూడోవంతు ఆదాయం అచెబె నవలలపైనే వచ్చేదంటే ఆయన రచనల ప్రాచుర్యాన్ని అర్థం చేసు కోవచ్చు. అదే కాలంలో అచెబె ఇతర ఆఫ్రికా రచయితల నవలలు సైతం ఇతోధికంగా ప్రచురించడానికి కారణ మయ్యాడు. ఒక కారు ప్రమాదంలో అచెబె నడుం క్రింది భాగం అంతా చచ్చుబడి పోవడంతో 1990 నుండి వీల్ చైర్‌కే పరిమితమయ్యాడు.





'థింగ్స్ ఫాల్ అపార్ట్' నవలలో గిరిజన తెగల సంప్రదాయాలు, విశ్వాసాలు, వారి ఉత్సవాలు, ఆడవారి మనోభావాలు, వారి కష్ట సుఖాలు, పిల్లల కోసం తల్లిదండ్రులు పడే ఆరాటాలు, ప్రకృతితో ఆ గిరిజనుల జీవన పోరాటం వంటి ఎన్నో అంశాలను అచెబె అద్భుతంగా ఆవిష్కరించాడు. కథాగమనం అనితర సాధ్యంగా కనిపిస్తుంది. ప్రతి అంశాన్ని వివరించే తీరు గొప్పగా ఉంటుంది. అన్నీ కళ్లకు కట్టినట్టే ఉంటాయి. ఆయన రచనల గురించి చెప్పడం కంటే, చదివి ఆస్వాదిస్తేనే అందులోని మాధుర్యం అర్థమవుతుంది. అచెబె తన రచనలను ఇంగ్లీషులో రాసినప్పటికీ సందర్భానికి అనుగుణంగా ఆ తెగ మాట్లాడే పదాలనే వాడేవాడు. దానితో ఆ రచనలో నేటివ్ టచ్ ఎక్కువగా కనిపిస్తుంది. పాత్రల పరిచయంతో పాటు, వాడిన ఆఫ్రికా పదాల వివరణలు కూడా ఆ నవల ఆరంభంలో ఉంటాయి. అందుకే, పాఠకుడికి ఎక్కడా తడుముకోవాల్సిన పరిస్థితి ఏర్పడదు.

'థింగ్స్ ఫాల్ అపార్ట్' తర్వాత చాల కాలం వరకు పెద్ద రచనలు చేయనప్పటికీ అచెబె అనేక కథలు రాశాడు. వ్యాసాలు సంకలనాలు ప్రచురించాడు. కవిత్వం కూడా రాశాడు. చిన్న పిల్లల కోసం కూడా అనేక పుస్తకాలు రచించాడు. 'నో లాంగర్ ఎట్ ఈజ్', 'యారో ఆఫ్ గాడ్' అనేనవలలను 1964లో రాసినప్పటికీ, వాటి ఇతివృత్తాలు కూడా క్రిస్టియన్ మిషన్ రాక, వలస పాలన ఫలితాలే. 1987లో వెలువడిన 'యాంట్ హిల్స్ ఆఫ్ ది సావన్నా' నవల ఒక వూహాజనిత పశ్చిమాఫ్రికా దేశంలో సమకాలీన పరిస్థితులను వ్యంగ్యంగా వివరిస్తుంది. దానిలో ప్రధాన పాత్ర శామ్ అనే సైనికాధికారిది. అతను ఆ దేశానికి అధ్యక్షుడుగా కూడా అవుతాడు. ఆ తర్వాత విపరీతమైన అధికార దుర్వినియోగానికి పాల్పడతాడు. దాన్ని ప్రతిఘటించిన తన స్నేహితులను సైతం అంతం చేస్తాడు. చివరికి ఒక సైనిక కుట్రతో పదవీచ్యుతుడవుతాడు. ఆఫ్రికా దేశాల్లో పరిణామాలను అనుసరించే వారికి ఇవన్నీ తెలిసిన విషయాలే అయినప్పటికీ అచెబె తనదైన శైలిలో వాటిని వివరించడం, వాటి ద్వారా ఆయన అందించే సందేశం ముఖ్యమైనవి. ఏ రచనకైనా ఒక ప్రయోజనం ఉండాలని, మంచి సందేశం దానిలో ఇమిడి ఉండాలని అచెబె దృఢంగా విశ్వసించేవాడు. అత్యుత్తమ సాహితీవేత్తగా ఎదిగిన అతనిని ఎన్నో అవార్డులు, మరెన్నో రివార్డులు వరించాయి. 2007లో అంతర్జాతీయ బుకర్ బహుమతి అందుకున్నాడు. ఆ బహుమతి తనను తాను గౌరవించుకోవడమేనని ప్రముఖులు పేర్కొన్నారు. ఆధునిక ఆఫ్రికా సాహిత్యానికి పితామహునిగా పరిగణించబడే అచెబెకు నోబెల్ బహుమతి రాకపోవడానికి కారణం తెల్లజాతివారి పట్ల, వలస పాలకుల పట్ల ఆయన రచనల్లో వ్యక్తమయ్యే నిరసనే అన్నది చాల మంది విశ్వాసం. వలసదేశాల ప్రజల పట్ల సానుభూతి చూపుతుందని శ్వేతజాతీయులు పరిగణించే జోసఫ్ కాన్రాడ్ రచన 'హార్ట్ ఆఫ్ డార్క్నెస్'ను అచెబె తీవ్రంగా విమర్శించడం కూడా సంపన్న దేశాల వారి ఆగ్రహానికి కారణం కావచ్చు. కాన్రాడ్ పూర్తి స్థాయి జాతి దురభిమాని అని అచెబె విమర్శించాడు. అంతేకాదు, వీఎస్ నైపాల్‌ను ఆధునిక కాన్రాడ్ అనికూడ ఎత్తిపొడిచాడు.





'నేను స్కూలుకు వెళ్లడం మొదలు పెట్టి రాయడం, చదవడం నేర్చుకునే టప్పటికి ఇతర దేశాల, ఇతర ప్రజల గాథలు మాత్రమే తెలుసుకోగలిగే వాడిని. అవన్నీ శ్వేత జాతీయుల మంచితనం గురించే ఉండేవి. సహజంగా నేను కూడ శ్వేత జాతీయులంత మంచివారు లేరని నమ్మేవాడిని. వారే తెలివికలవారు, మిగతా వారంతా వెర్రివారని భావించే వాడిని. అప్పుడే నాకనిపించింది, అసలు మనకంటూ మన కథలుండాలి కదా అని. 'సింహానికి తన చరిత్ర తనకు తెలియకపోతే, వేటగాడి చరిత్రే ఎల్లప్పుడూ కీర్తించ బడుతుందన్నది' అనే ప్రసిద్ధ సామెత గుర్తుకు వచ్చింది'.

– సత్యశ్రీ

## విద్వేష రాజకీయాల గుట్టు విప్పిన 'ట్రోల్' సంపాదకీయం

సాంకేతిక పెరుగుతున్న కొద్దీ సమాజంలో శాస్త్రీయత పెంపొందాలి. కానీ నేటి సమాజంలో పరిస్థితులు అందుకు భిన్నంగా తయారవుతున్నాయి. అశాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించడం కోసం పాలకవర్గాలు కంకణబద్ధం కావడమే ఇందుకు కారణమనేది బహిరంగ రహస్యం. ప్రధానంగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఫాసిజం హెచ్చరిల్లుతోంది. ఫాసిస్టు మూకలు సృష్టిస్తున్న ఆగడాలు అంతా ఇంత కాదు.

సామాజిక ఉద్యమకారులు, హక్కుల నేతలు, ఫెమినిస్టులు, భౌతిక వాదులు ఇలా అనేక రకాలుగా సమాజాన్ని మార్చాలి ఉన్నత స్థితికి తీసుకుపోవాలి అని ప్రయత్నించే ప్రతి ఒక్కరిని ఫాసిస్టు మూకలు టార్గెట్ చేస్తున్నాయి. వారు సమాజ మార్పు కోసం చేసే ప్రయత్నాల పట్ల విషం చిమ్ముతున్నాయి. వారిపై దాడులు దౌర్జన్యాలతోపాటు, సోషల్ మీడియా వేదికగా రకరకాల ట్రోల్స్ సృష్టిస్తున్నాయి. ఆ ట్రోల్స్ ఏ విధంగా ఉంటా యి, వాటి వెనుకాల అసలు ఉద్దేశం ఏంటి ...? ఆయా పార్టీల ఐటి సెల్స్ ఫేక్ ఐడీలతో అభ్యుదయవాదుల పట్ల అసభ్య పదజాలంతో చేస్తున్న దాడి వెనకాల రహస్య ఎజెండా ఏంటి...? ఇలా రకరకాల సందేహాలను నివృత్తం చేసేదే ట్రోల్ సంపాదకీయం.. కే ఎన్ మల్లేశ్వరి, కాత్యాయనీ విద్మహే సంపాదకులుగా వ్యవహరిం చి మలుపు ముద్రణ సహకారంతో ఈ పుస్తకాన్ని తీసుకురావడం జరిగింది.


పుస్తక సమీక్ష

ఇందులో అభ్యుదయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా విభిన్న రంగాల్లో పనిచేస్తున్న 15 మంది మహిళలు వారు చేస్తున్న ఆక్టివిటీ మూలంగానో వ్యాసాల మూలంగానో ఏ విధమైన ట్రోల్స్‌ను ఎదుర్కొన్నారు. వాటి ప్రభావం వారిపై ఎలా ఉంది. నీచమైన పదజాలంతో, జుగుప్సాకరమైన పోస్టులతో వారు కుటుంబపరంగా, మానసికంగా ఏ విధమైన సంఘర్షణను ఎదుర్కొన్నారు...?ఇలా వారు ఎదుర్కొన్న అవమానాలను తెలుపుతూ అనేక అనుభవాలను ఈ పుస్తకం ద్వారా పంచుకోవడం జరిగింది.

సోషల్ మీడియా వేదికగా మానవ హక్కులు హరించబడుతూ మన చట్టాలు, ప్రభుత్వాలు, సైబర్ క్రైమ్ వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు, స్థానిక పోలీసుల వ్యవహార శైలి ఈ పుస్తకం చదువుతూ మనల్ని విస్తుగొలుపుతుంది. ఈ పుస్తకంలో దేవి గారు చెప్పినట్లు...చచ్చిన వాళ్లకి పరమాన్నం పెట్టి, బతికున్న వాళ్లను ఆకలితో చంపే సమాజంలో మనమున్నాం. ఈ సమాజం అభ్యుదయం కావాలం, మానవీయత వికసించాలన్నా అనేక సవాళ్లను ఎదుర్కోక తప్పదు. ప్రధానంగా ట్రోలింగ్ ముసుగు వేసుకున్న తోడేళ్ల గుంపును, ఎదుర్కోవాలం ప్రత్యేక కార్యచరణ ఏర్పడాల్సిన అవసరం ఉందనేది ఈ పుస్తకం సూచిస్తుంది. ఈ 15 మంది రచయితలే కాదు కంచ ఐలయ్య, బైరి నరేష్, వేణుగోపాల్, పల్లం నారాయణ, మరో 10మంది ప్రముఖుల అభిప్రాయాలు కూడా నమోదు చేయడం జరిగింది. వారి అనుభవాలు, సలహాలు సూచనలు ఈ పుస్తకం ద్వారా అవగతం చేసుకోవచ్చు.

కోగిల చంద్రమౌళి,
9573187218

## సాహిత్య వ్యవస్థల వైవిధ్యం




దక్షిణాఫ్రికా సాహిత్యంలో ఎవరైనా ఎదుర్కొనే మొదటి సమస్య సాహిత్య వ్యవస్థల వైవిధ్యం. 'విద్యావేత్తలు, రాజకీయ నాయకులు 'దక్షిణాఫ్రికా సాహిత్యం' గురించి మాట్లాడటం అసాధారణం కానప్పటికీ, నేల స్థాయిలో పరిస్థితి వైవిధ్యం, విచ్ఛిన్నతతో కూడి ఉంటుంది' అంటాడు గెరిట్ ఒలివియర్. 'వర్ణవివక్ష వ్యవస్థకు సంబంధించి, శాశ్వతమైన, విచారకరమైన వారసత్వాలలో ఒకటి తెలుపు, నలుపు. ఇది దక్షిణాఫ్రికాలో మిశ్రమజాతికి సంకేతం.

ఆసియా ఎప్పటికీ 'దక్షిణాఫ్రికా' గా మారలేదు. ఏదేమైనప్పటికీ, సమస్య వర్ణవివక్షకు పూర్వం ఉంది. ఎందుకంటే దక్షిణాఫ్రికా ఎల్లప్పుడూ భాషాపరంగా, సాంస్కృతికంగా విభిన్నంగా ఉండే కమ్యూనిటీలు కలిగిన దేశం. ఈ సంస్కృతులు కొంతవరకు స్వయంప్రతిపత్తిని కలిగి ఉన్నాయి. వివాదాస్పద దక్షిణాఫ్రికా వంటి సంకలనాన్ని రూపొందించాయి' అని రాబర్ట్ మోస్మాన్ వ్యాఖ్యానించాడు.

## జాతీయతకు చిహ్నం 'ఆఫ్రికాన్స్'

దక్షిణాఫ్రికాలో 11 జాతీయ భాషలు, ఆఫ్రికాన్స్, ఇంగ్లీష్, జులు, షోసా, సోతో, పెడి, త్స్వానా, వెండా, సిస్వతి, సోంగా, నెబెలె, ఉన్నాయి. కాబట్టి, దక్షిణాఫ్రికాకు సంబంధించిన సాహిత్య చరిత్ర తెలియాలంటే, ఈ భాషలన్నిటిలోనూ వచ్చిన సాహిత్యాన్ని చర్చించాల్సి ఉంటుందనే వాదన కూడా లేకపోలేదు. ఏదిఏమైనా 'జాతీయ' అని చెప్పగలిగే లక్షణాలను స్వీకరించిన ఏకైక సాహిత్యం ఆఫ్రికాన్స్. దక్షిణాఫ్రికాలోని అన్ని సాహిత్యాలలో, ఈ సాహిత్యం మాత్రమే జాతీయ సాహిత్యంగా వెలుగుతున్నది. అది ఒక ప్రత్యేక అస్తిత్వంగా కొనసాగుతున్నది. బోధన ద్వారా సంస్థాగతంగా స్థిరపడింది. కాబట్టే తనకంటూ ఒక స్పష్టమైన రూపాన్ని అభివృద్ధి చేసుకుంది. ప్రపంచమంతా విస్తరించిన ఆంగ్లం, వలస రాజ్యం కారణంగా ఆఫ్రికాలోనూ బలంగా స్థిరపడింది. అందుకే, కొన్ని ప్రాంతాల్లో, ఆంగ్లాన్నే జాతీయ భాషగా పేర్కొంటారు. కానీ, స్థూలంగా చూస్తే మాత్రం ఆఫ్రికాన్స్‌ను అత్యధిక శాతం మంది మాట్లాడతారు. ఇంగ్లీషును మినహాయిస్తే, ఆఫ్రికా గుర్తించిన భాషల్లో ఆఫ్రికాన్స్‌లోనే ఎక్కువ పరిమాణంలో సాహిత్యం వెలువడింది.



మరో రకంగా చెప్పాలంటే, అంతర్జాతీయ ఆంగ్ల సాహిత్యానికి కొనసాగింపుగా దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ సాహిత్యం కొనసాగుతున్నది. కాగా, ఆఫ్రికాన్స్‌పై డచ్, జర్మన్ భాషల ప్రభావం ఎక్కువ. దీని మూలాలు 17వ శతాబ్దంలోనూ కనిపిస్తాయి. అయితే 1875 లో 'జెనూట్స్‌కాప్ వాన్ రెగ్టే ఆఫ్రికానెర్స్'ను స్థాపించిన తర్వాత ఆఫ్రికాన్స్‌ను అధికారికంగా గుర్తించారు. దక్షిణాఫ్రికా అంతటా ఈ భాషను మాట్లాడతారు. అధిక సంఖ్యాకులు దీనిని తమ మాతృభాషగా భావిస్తారు.

## సాహిత్యం కొత్త పుంతలు..

దక్షిణాఫ్రికా జాతీయ గీతం 'డై స్టెమ్' రాసిన లీపోల్ట్‌తోపాటు, లాంగెన్‌హోవెన్, ఎన్‌పి వాన్ వైర్ లూవ్, అతని సోదరుడు డబ్ల్యు ఇజి లూవ్, ఎలిజబెత్ ఐబర్స్ తదితరులు ఆఫ్రికాన్స్ సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించారు. 1930 దశకంలో ఆఫ్రికాన్స్ సాహిత్యం విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ప్రధానంగా వ్యవసాయ సమాజం కావడంతో, ప్లాస్రోమన్ (వ్యవసాయ నవల) ప్రారంభమైంది. 1960 దశకాల్లో పేరడీ సాహిత్యం విరివిగా వచ్చింది. వెంటర్ 0రాసిన 'ఎక్స్‌ట్రామెల్ ఎక్స్‌ట్రేవ్', మేరీ లిండే రచన 'ఆండర్ బెవూరెటె మెన్స్' ఆఫ్రికాన్‌లో వచ్చిన వ్యంగ్య రచనలకు మచ్చుతునకలు.

## సంప్రదాయవాదంపై నిరసన గళం..

ఆఫ్రికాన్స్ సాహిత్యం సంప్రదాయవాద సంస్కృతిని విమర్శిస్తుంది. వర్ణవివక్ష పాలనలో రాజకీయాలను కూడా విమర్శిస్తుంది. ఈ రకమైన సాహితీ సృజనలో ఆండెర్ పి. బ్రింక్, ఐటినే లెరాక్స్ ముందు వరుసలో ఉంటారు. బ్రింక్ రచనలు ఆంగ్ల పాఠకులకు కూడా అందుబాటులో ఉంటాయి. ఆయన ఇంగ్లీషు, ఆఫ్రికాన్స్ భాషల్లో సాహితీ ప్రస్థానాన్ని కొనసాగించాడు. ఆఫ్రికాన్స్‌లో 'డ్యూవెలస్కూఫ్'ను ఆయన ఆంగ్లంలో 'డెవిల్స్ వ్యాలీ'గా అందుబాటులోకి తెచ్చాడు. బ్రింక్ విస్తారమైన రచనల్లో గద్యం, నాటకం వంటి ప్రక్రియలు ఉన్నాయి. ఇక లెరాక్స్ రచనలు రాసిలో తక్కువకావచ్చుగానీ వాసిలో మాత్రం ఎంతో గొప్పవి. ఆఫ్రికా సాహిత్యంపై అతను తనదైన ముద్ర వేశాడు. లెరాక్స్ పాత్రలు తరచుగా బయటి వ్యక్తులే. అందుకే, దక్షిణాఫ్రికా సమస్యలపై అతను వ్యంగ్య బాణాలను విసిరే అవకాశాలు మరింత మెరుగుపడతాయి. అతని రచనలు 'జుంగియన్', 'కబాలిస్టక్' సిద్ధాంతాలకు దగ్గరగా ఉంటుంది. లెటీ విల్జోయెన్, అలెగ్జాండర్ స్ట్రాచన్, ఎటిఎన్ వాన్ హీర్డెన్ తదితర రచనలపై ప్రభావం చూపింది.



## ఈ వారం కవితలు

### గుణపాఠాలు..!

వెనకడుగు వేయడం..
ఓటమి కానే కాదు
అదో సింహావలోకనం
గుణపాఠాల్ని బోధించే..
ఓటమి కూడా గురువే కదా
ఓటమిని తప్పించుకోవడం..
అప'జయం'లో జయాన్ని చూడడం
సర్వశక్తులతో సమాయత్తం కావడం
గెలుపు తీరాల్ని ముద్దాడడానికే కదా !

ప్రయత్నంలో తడబడినా..
గెలుపు తృటిలో తప్పినా..
జయం దాగుడు మూతలాడినా..
స్వప్నాలు కల్లలుగానే మిగిలినా..
బాధల్ని, నిరాశా వేదనల్ని భరిస్తూ..
అవాంతరాల్ని ఓడించి అధిగమిస్తూ..
చేపడితే దోబూచులాడే విజయాన్ని..
ఆనంద అమృతం వర్షించాల్సిందే !

మట్టిలో మెరిసే మాణిక్యాలు
ఇసుకలో సుందర సౌధాలు
బండలో దాగిన భగవంతులు
వృక్షాల్లో తిష్టేసిన ఔషధాలు
సిరా వెదజల్లే అక్షరామృతాలు
హస్తరేఖల్లో దాగిన అదృష్టాలు
లోహంలో వన్నెల ఆభరణాలు
దర్శించాలి వివేకి మానవుడు
మనిషిలో మానవత్వ వెలుగుల్ని..
ఎన్నటికైనా దర్శించగలడా నరుడు !

మధుపాళీ
9949700037

### తొవ్వ నేర్పిన పాఠం

ఆ తొవ్వను చూసినప్పుడల్లా
ఆకాశంలో అందమైన చందమామను
చూసినంత ఆనందం
అందరు ఆ తొవ్వలో ముళ్ళుంటాయని
చెప్పులు తొడుక్కొని నడిస్తే
నేను అక్షరాలు తొడిగి నడిచాను.

ఆ తొవ్వ
మా ముందు తరాలకు
అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుండేది.
మా తాతల చరిత్ర నుండి
ఆ తొవ్వలో మొదటి అడుగులు నావే
దోస్తులు అందమైన సంచిలో
పుస్తకాలు మోసుకెళుతుంటే
నేను మాత్రం
షేనుకు మందు జల్లిన వర్మసంచులను
పుస్తక సంచిగా కుట్టిచ్చుకోని
రెండు జబ్బలకు ఏసుకొని పోతుంటే
పంపెత్తుకొని మందుగొట్టడానికి పోతున్న
బాలకార్మికునిలా కనబడేది.

ఆ తొవ్వకు
తొలిసూరి అడుగులని కావచ్చు
ప్రతి అడుగులో కన్నీటి బొట్టును తలుచుకుంటూ
అయస్కాంతానికి అంటుకున్న ఇనుములా
కాలు కదిలేది కాదు.

ఆ తొవ్వలో అందరు ముఖాలకు
పౌడరేసుకొని కనబడుతుంటే
నేను మాత్రం ఆత్రంగా పరుగులు తీసి
చెమట చుక్కలతో ముఖమంతా ఉప్పుపేలి
పౌడరోలె దగదగ మెరిసేది.
ఆ తొవ్వ కొచ్చెగుండె
కంకరాళ్ళతో మొదలై
గొల్కొండ గోడమీద నిల్చొని
రాజధానంత వీక్షించే వరకు చేర్చింది.

ఆ తొవ్వలో నడిపించిన
తల్లిదండ్రులు, గురువులు
నన్ను చూసినప్పుడల్లా
రోటిలో నూరిన తొక్కులాగా
ఎంతో రుచికరంగా ఉందని హత్తుకుంటారు.

ఆ తొవ్వ తోడునిచ్చింది
ఆ తొవ్వ నీడనిచ్చింది
ఆ తొవ్వ వెలుగునిచ్చింది
ఆ తొవ్వ చికటి రుచి చూపింది.

ఇగ ఆ తొవ్వ
నాగుంపాము నడుం లెక్క
వంకలు దిరుగుతూ
నా జీవితాన్ని తిప్పింది.

డా. గిన్నారపు ఆదినారాయణ
9949532456

### తల్లి వేరు

ఓ రాకాసి రంపం
తల్లివేరుని తెగ్గోస్తుంది
ఆంగ్లాక్షరమ్ 'కె' అక్షర ఆకారపు
(k shaped) ఆర్థిక రాక్షసి
కవితా వృక్షపు తల్లి వేళ్ళని తెగ్గోస్తుంది!
సెలయేటి తేటనీటిని
దోసిళ్లలో తాగినట్లు
తల్లిభాషని సులువుగా పలకొచ్చు!
గొట్టపు బావి నుండి తోడుకున్నట్లు
ఆంగ్లభాషని నిఘంటువుల్లోంచి
ఆకళింపుకి ఆమడ దూరం పట్టొచ్చు!
కవితా వృక్షపు తల్లి వేళ్ళు భాషలు !
శరీర నరాలై
మల్లెపూల పొదలా
పుష్పింప చేస్తాయి మనిషిని !
పుట్టింటి మధురిమ సరిగమలని పలికిస్తాయి !
పనులతో గలగల నవ్వే
పొద్దుటిపూట తలుపులు తెరుస్తాయి !
ఆస్తులు లేక పస్తులుండొచ్చు
సంస్కృతీ లతలు సాగకపోతే
బతుకు సువాసనలు వెదజల్లబడవు !
కళలే
నిండు మనిషిని అలంకరిస్తాయి
జీవితాలకి పైరుగాలిలా
ప్రాణవాయువులందిస్తాయి !
కవితా కళామతల్లి
తల్లివేళ్ళ భాషలని తెగ్గోస్తున్నారు !
మైత్రీ తంతి కవిత!
కరవాలాలకి ఆలవాలం కాదు !
జగడాల జెండాలనెగరవేయదు
మరుభూముల
ఏరువాక సాగుతున్న వేళ
కయ్యాల సంస్కృతికి మంగళం పాడే
కవితా కళకళకళ లాడాలి !
కవితావృక్షపు
తల్లివేళ్ళ భాషలు నిగనిగలాడాలి !
తల్లి తెలుగు, తెలుగు కవిత తళతళ లాడాలి !

ఒబ్బిని, 9849558842

### తెలుగు భాష గొప్పతనం

తెలుగు అంటే ఒక వెలుగు
అమ్మ భాష తెలుగుభాష
కమ్మనైన భాష తెలుగు
అమ్మ నేర్పిన అమ్మ భాష తెలుగు!!!

తీయనైన భాష తెలుగు భాష
అమ్మ ఒడిలోన పలికే తెలుగు భాష
తెలుగు భాష పాటల ఊట
సకల కళలకు పూదోట తెలుగు భాష!!!

నలుగురు మెచ్చే నా తెలుగు భాష
బహు చక్కనైన నా తెలుగు భాష
అందరినీ ఒక్కటి చేసే నా తెలుగు భాష
ఆత్మగండ్ల భాష నా తెలుగు!!!

స్వచ్ఛమైన తెలుగు భాష
అందమైన మన తెలుగు భాష
సంస్కృతి సాంప్రదాయాలకు
నిలయం తెలుగు భాష
అందమైన ప్రపంచంలో
అందమైన భాష తెలుగు!!!

అమృతం లాంటి అమ్మ భాష తెలుగు
ఆనందాన్ని ఇచ్చే తెలుగు భాష
ఆత్మ బంధువు లాంటి భాష తెలుగు
వెన్నెల లాంటి వెలుగునిచ్చే తెలుగు భాష
అవని లో అమ్మ భాష గొప్పది!!!

దేవులపల్లి రమేష్,
9963701294

### సాగిపో...

పంచభూతాల సాక్షిగా జనించి,
వాటి ఆసరాగా జీవించి
వాటిలోనే కలిసిపోయే మానవజాతి
ప్రగతికి సోపానం,
అజ్ఞాన తిమిరాలను తరిమే విజ్ఞాన
వనం.
అది ఎందరో మేధస్సుల కష్టార్జితం.

ఓ మనిషీ!
నీవున్నా,లేకున్నా
నిను మానవునిగా నిలిపేవి
కీర్తి శిఖరాలు... అందుకే...
సృజనాత్మకతతో,



ప్రసరించిన తేజస్సుతో
సత్యాన్వేషణకై వడివడిగా కదిలి
నిరంతరాధ్యయనంతో
సమాజ పురోగతికి వారధివియై,
ఎన్నో పరిశోధనలు,
మరెన్నో పరికల్పనలతో
శాస్త్రవిజ్ఞాన ప్రగతి సాధించే
నాయకునివై,
అభివృద్ధికి ఆలవాలమైన
వైజ్ఞానిక వెలుగుల ప్రస్థానమై,
నవయుగ వైతాళికునివై
సతతం అన్వేషిగా సాగిపో..

వేమూరి శ్రీనివాస్
9912128967

### కొత్త సంతకం

నడుస్తున్నాను నిర్విరామంగా
యాంత్రికంగా
తాంత్రికంగా
మర బొమ్మలా
లాక్కెళుతున్నాయి కాళ్లు ..
వెనక్కి రమ్మని
జ్ఞాపకాల రొద ..
దాచుకున్న
కాగితాల సొద..
నా ఆశల సౌదాల
దగ్గరికి ..
అవి శిథిలంగా
చిందరవందరగా ఉన్నాయి..
ఎరుకొంటున్న అపురూపంగా..! సగంలో వదిలిన
రాగాలను శ్రుతి
చేసుకుంటున్నా..!
హృదయ
నిక్షిప్త జీవకళల
భద్రంగా తీస్తున్నా..
పరిశోధిస్తున్నా!
పరిశీలిస్తున్నా!
నా ఆశయాల అనుభూతులను
స్పృశిస్తున్న.. గెలవాలని
ఆరాటపడుతున్న..
కాలం ఆగిపోయెలోగా..
కొన్ని అయినా దక్కించుకోవాలని..
పోగేసుకొవాలని..
కొత్త కలలు కంటూ..
ప్రతి ఉదయం
మేల్కొంటున్న..
కొత్త సంతకంతో
రాస్తున్నా

గడ్డం సులోచన
7702891559

## మియాపూర్‌లో చెడ్డీ గ్యాంగ్ కలకలం..

### రూ.7.85 లక్షల చోరీ



**హైదరాబాద్ :** మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చెడ్డీ గ్యాంగ్ సంచారం కలకలం రేపుతోంది. హాఫీజ్ పేట్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో శనివారం అర్ధరాత్రి కొందరు దుండగులు చోరీకి తెగబడ్డారు. చెడ్డీలు ధరించి మారణాయుధాలతో వచ్చిన వీరు.. స్కూల్ కార్యాలయంలోని కౌంటర్‌లో రూ.7.85 లక్షల నగదును దోచుకెళ్లారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు.

## చల్లా నర్సింహ్మారెడ్డికి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/యాచారం :** రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డికి తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ , నాయకులు కలిసి అదివారం కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతొ కాంగ్రెస్ పార్టీ ఈ పదవి కట్టబెట్టిందని అన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి అయన కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గోన్నారు.


## ఢిల్లీ వెళ్లిన ఉప రాష్ట్రపతి దంపతులకు ఘనంగా వీడ్కోలు

### పాల్గొన్న గవర్నర్ తమిళసై సౌందరాజన్, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ఖర్ హైదరాబాద్ పర్యటనలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగురులోని కన్హా శాంతి వనంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న ఉప రాష్ట్రపతి పర్యటన ముగించుకుని తిరిగి ఢిల్లీ వెళ్ళుటకు ఆదివారం ఉదయం శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం చేరుకున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ఖర్, ఆయన సతీమణి సుదేష్ ధన్ఖర్‌లను రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందరాజన్, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి, ఇతర అధికారులు తదితరులు వీడ్కోలు పలికారు.

## ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/కేశంపేట :** తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ సోసైటి నూతన చైర్మన్‌గా ఎంపికైన మెట్టు సాయికుమార్‌ను ఆదివారం రాష్ట్ర ఫిషర్మెన్ కమిటి ఎగ్జిక్యూటివ్ మెంబర్ తుమ్మల గోపాల్‌ముదిరాజ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సాయికుమార్‌ను రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ సోసైటి చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రులందరికి గోపాల్‌ముదిరాజ్ ముదిరాజ్ సామాజికవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తీసుకురావాలని ఆయన కోరారు.

## స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రుల చేయూత



**ప్రజాపక్షం/కేశంపేట :** అనారోగ్యంతో మృతి చెందిన తమ స్నేహితుని కుటుంబానికి అతనితో కలిసి చదువుకున్న బాల్య మిత్రులు ఆర్థిక సహాయం అందజేసి చేయూతనిచ్చారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ శ్రీశైలం గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీశైలంకు భార్య, ఇద్దరు పిల్లల ఆర్థిక పరిస్థితి బాగా లేక ఇబ్బందులు పడుతున్నారు. నిరుపేదైన శ్రీశైలం కుటుంబసభ్యులకు బాల్య మిత్రులు పోగు చేసిన 80,551 రూపాయలను ఎల్ఐసిలో డిపాజిట్ చేసి బాండ్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. మరో రూ.5 వేలు నగదును ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు శివ, నందు, జహంగీర్, శేఖర్, వీరేష్, రమేష్, అంజనేయులు, కుమార్, మల్లేష్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప పండగ



**ప్రజాపక్షం/షాబాద్ :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడలో ఆదివారం ఘనంగా బీరప్పల పండగ నిర్వహించారు. ఉదయం నుండి గ్రామంలో మహిళలు ప్రతి ఇంట అందమైన ముగ్గులతో అలకరించి బోనాలతో ఆట పాటలతో బయలుదేరి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా తిమ్మారెడ్డి గూడలో అంగరంగ వైభవంగా బీరప్పల పండగను జరుపుకోవడం విశేషంగా మారింది. గ్రామంలోని పెద్దలందరూ కలిసి కట్టుగా కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ సంప్రదాయం పద్ధతిగా ఈ పండగను జరుపుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో బీరప్పల పండగ నిర్వహించడంతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళ్లలు తదితరులు పాల్గొన్నారు.

## దోచుకున్న సొమ్మును దాచుకోవడానికే కాంగ్రెస్‌లోకి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** సిట్టింగ్ ఎంపి రంజిత్ రెడ్డి దోచుకున్న సొమ్మును దాచుకోవడానికి రాష్టంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరాడని,పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా చేవెళ్ల పార్లమెంటు నుండి 2 లక్షల ఓట్ల మెజారిటీతో బిజెపిని గెలిపించాలని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి, మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మే 13న జరగబో యే పార్లమెంట్ ఎన్నికల కోసం ఆదివారం చేవెళ్ల అసెంబ్లీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం చేవెళ్ల పట్టణంలోని సిహెచ్ఆర్ గార్డెన్‌లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చేవెళ్ల పార్లమెంటు విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బిజెపికి పోటీయే లేదు అని చెప్పారు. ఎన్నికల క్షేత్రంలో బూత్ కమిటీ సభ్యుల పాత్ర కీలకం. బిజెపిలో బూత్ సభ్యులకు ఉన్న ప్రాధాన్యత వేరే ఇతర నాయకులకు లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,మాజీ ఎం ఎల్ ఎ కె.ఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్,అసెంబ్లీ కన్వీనర్ ప్రతాపరెడ్డి, జాయింట్ కన్వీనర్ సింగపురం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికవర్గ, రైతు కూలీల పోరాటాలు







### రానున్న కాలంలో విప్లవ పోరాటాలకు నాంది పలుకుదాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు

**ప్రజాపక్షం /నార్సింగి:** కమ్యూనిస్టు ఉద్యమం ఎన్నో ఒడిదుడుకులను చవిచూసిందని, ఎన్ని అవంతరాలు ఎదురైనా ఎన్ని సవాళ్లు ఎదురైనా కమ్యూనిస్టు పార్టీ ఎదుర్కొన్న కఠినమైన పరిస్థితులు ఏ రాజకీయ పార్టీ ఎదుర్కోలేదని ఎన్ని కష్టాలు వచ్చినా కమ్యూనిస్టు పార్టీని కాపాడుకోవడం కోసం కార్యకర్తలు కష్టపడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు సాంబశివరావు తెలిపారు. ఆదివారం సిపిఐ రంగారెడ్డి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో రెండవ రోజు ఆయన పాల్గొని కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకోవడానికి వెనకాడిన కెసిఆర్ ఈరోజు ఆ పార్టీతో పొత్తు పెట్టుకునే వాడే లేకుండా పోవడం బాధాకరమని అన్నారు. నేడు కెసిఆర్ పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలాగా అయిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతి పక్ష పార్టీలను నిర్వీర్యం చేసి రాజకీయంగా పబ్బం గడుపుకున్న కెసిఆర్. ఈరో జు కెసిఆర్ పార్టీకి అదే పరిస్థితులు ఎదురు కావడం తథ్యమని ఆయన అన్నారు. ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేయాలన్న కెసిఆర్ ఎత్తుగడే ఈనాడు ఆయన కొంప ముంచుతున్నదని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టులకు సీట్లు ఓట్లు ముఖ్యం కాదని ప్రజల పక్షాన నిరంతరం పోరా డే కర్తవ్యం ఒక్కటే కమ్యూనిస్టుల ముందు ఉందని ఆయన తెలిపారు. రాబోయే కాలంలో విప్లవ పో రాటాలకు నాంది పలికి కార్మిక వర్గ పోరాటాలు రైతు కూలీల పోరాటాలను నిర్వహిస్తామని ఆయ న తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిపిఐ నాయకుడు శంకర్ నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి , కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, ఎం యాదిరెడ్డి, సయ్యద్ అప్సర్, ఓరుగంటి యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కే రామస్వామి, కామెడీ శేఖర్ రెడ్డి, ప్రభులింగం, బుద్ధుల జంగయ్య ఎం శ్రీను, పబ్బతి లక్ష్మణ్, నీలమ్మ, ఎం.కిషోర్, సిపిఐ మండల కార్యదర్శి నర్రా గిరి , మల్లేష్, బాబు రావు, యాదగిరి జిల్లా సమితి సభ్యుడు ఆర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# తుదిదశకు చేరుకున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చర్లపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరికొన్ని వారాల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరంలోని రైళ్లు ప్రధానంగా మూడు ప్రధాన టెర్మినల్స్ అయిన సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ ద్వారా సేవలు అందిస్తున్నాయి. నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్నరద్దీ అవసరాలను తీర్చడానికి, జంట నగరానికి పశ్చిమ భాగంలోని లింగంపల్లిని మరొక టెర్మినల్ స్టేషన్‌గా అభివృద్ధిచేశారు. ఇదే వరవడిని ముందుకు తీసుకెళ్ళే దిశలో భాగంగా చెర్లపల్లి రైల్వేస్టేషన్‌ను మరో టెర్మినల్ స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు. చర్లపల్లి హైదరాబాద్‌కు తూర్పు వైపున ఉంది. ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఔటర్ రింగ్ రోడ్డుతో సమీపంలో ఉండటమే కాకుండా జంట నగర ప్రాంతంలో ఉన్న ఇతర రైలు టెర్మినల్స్‌లో రద్దీని తగ్గించడం, ముఖ్యంగా నగరం తూర్పు భాగంలోని ప్రయాణికులకు సేవలను అందించడానికి కూడా ఈ స్టేషన్‌ను టెర్మినల్ స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో రూ. 430 కోట్ల అంచనా వ్యయం తో పలు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రయాణికులకు అనేక వసతుల ఏర్పా టు చేస్తున్నారు. అధిక ప్రయాణికుల రాక పోకలకు అనుగుణంగా కొత్త గా నిర్మిస్తున్న ఈ స్టేషన్ భవనం అత్యంత ఆధునికంగా, సుందరంగా నిర్మా ణం జరుగుతోంది. ఈ స్టేషన్ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్లో ఆరు టికెట్ బుకింగ్ కౌంటర్లు, లేడీస్ వెయిటింగ్ హాల్, పు రుషుల వెయిటింగ్ హాల్, ఎగువ తరగతి వెయిటింగ్ హాల్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, మొదటి అంతస్తులో కేఫ్టేరి యా, రెస్టారెంట్, స్త్రీలకు, పురుషులకు కోసం వి శ్రాంతి గదులు ఉంటా యి. స్టేషన్ భవనంలో వి శాలమైన కాన్కోర్స్ ప్రాం తాలు, స్టేషన్ ముఖ ద్వారానికి అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చే స్తున్నారు. అదనంగా 4 అదనపు ఎత్తైన ప్లాట్‌ఫారమ్‌లు ఉంటాయి. ఇప్పటికే ఉన్న 5 ప్లాట్‌ఫారమ్‌లకు కూడా పూర్తి నిడివితో పునర్ నిర్మాణం చేశారు. రెండు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఒకటి 12 మీటర్ల వెడల్పు, మరొకటి 6 మీటర్ల వెడల్పు, ప్లాట్‌ఫారమ్‌లు మధ్య రకపోకలు సులభతరంగా ఉంటాయి. మొత్తం 9 ప్లాట్‌ఫారమ్‌లలో ఎస్కలేటర్లు, లిఫ్టులు, మొత్తం 7 లిఫ్టులు, 6 ఎస్కలేటర్లు ప్రయాణీకుల అందుబాటులో ఉంటాయి. ఈ స్టేషన్ నుండి రైళ్లను ప్రారంభించేందుకు కోచ్ నిర్వహణ సౌకర్యాలను కూడా కలిగి ఉన్నాయి.

### స్టేషన్‌లో వచ్చే ఇతర ప్రధాన సౌకర్యాలు..

బస్ బే, కోచ్ ఇండికేషన్ బోర్డులు, రైలు సూచన బోర్డులతో పాటు అన్ని రకాల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. అన్ని ప్లాట్‌ఫారమ్‌లలో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, యట్ ఏ గ్లాన్స్ బోర్డులు. 24 గంటలు సిసిటివి కెమెరాలతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.





## గున్‌గల్ గ్రామంలో అయ్యప్పగుడి నిర్మాణానికి సహకరించాలి

### ఎంఎల్ఎ మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరిన గ్రామ నాయకులు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని గున్‌గల్ గ్రామంలో అయ్యప్పస్వామి గుడి నిర్మాణంకు సహకరించాలని కోరుతూ అదివారం గున్‌గల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంఎల్ఎ మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. గ్రామ సమస్యలను సైతం పరిష్కరించాలని ఎంఎల్ఎకు తెలిపారు. ఈసందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గుడి నిర్మాణంకు తన వంతుగా సహకరిస్తానని అన్నారు. గ్రామాభివృద్ధికీ అవసరమైన నిధులు కేటాయించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో అధికారం కట్టబెట్టారు అ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. అందరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ మాజి ఉపాధ్యక్షులు గజ్జి రామకృష్ణ యాదవ్, మాజీ ఎంపిటిసి యాదయ్య, కాంగ్రేస్ పార్టీ జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, గిరమోని రవింధర్, బచ్చు రవి, లక్ష్మ ణ్, ఆవ జంగయ్య, రమేశ్, రవి,శంకర్ వెంకటేశ్, నర్సింహ్మ తదితరులు పాల్గోన్నారు.

## ధర్మన్నగూడ గ్రామంలో రూ.8 లక్షలతో సిసిరోడ్ల నిర్మాణం


### బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుష్పాల శాంతి కుమార్..



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని ధర్మన్నగూడ నూతన గ్రామ పంచాయతీ అభివృద్ధికి, సిసి రోడ్ల నిర్మాణంకు రూ.10 లక్షలు ఎంపిపి కొప్పు సుకన్యభాషా సహకారంతో ఇచ్చారని బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుష్పాల శాంతికుమార్ తెలిపారు. అదివారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మన్నగూడ నూతన గ్రామ పంచాయతీకి నిధులు రాక పోవడంతో ఏమాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. గ్రామంలో అవసరమైన సిసి రోడ్లు, మురికి కాలువల ఎర్పాటుకు నిధులు కేటాయించాలని ఎంపిపిని కొరగా సిసి రోడ్ల నిర్మాణంకు రూ.10 లక్షలు మంజూరి చేయించారని అన్నారు. చిన్నగ్రామ పంచాయతీలో అవసరమైన చోట సిసి రోడ్లు వేశారని అన్నారు. కొంతవరకు రోడ్ల సమస్య తీరిందని అన్నారు. ఎంపిపికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో నాయకులు, సురేశ్‌చారి, మహెంధర్ లావణ్య, నర్సింహ్మ నగేశ్ తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

### ఉపాధ్యాయులకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011–12 సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం అదివారం ఘనంగా జరిగింది. 11 సంవత్సరాల తర్వాత మళ్ళి మేం కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు అనందం వ్యక్తం చేశారు. అప్పుడు విధ్యార్థులకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి, అప్పటి జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. వారు ఇప్పుడు ఎం చేస్తున్నారు. వారి యొక్క జీవన పరిస్థితులను అందరితో పంచుకున్నారు. పాఠశాలలో వంట పాత్రల కోసం 5000 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. పాఠశాల తరపున పూర్వ విధ్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులు సాబేర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు వేద శ్రీ, ఉపాధ్యాయులు యాదగిరిరెడ్డి,వెంకటేశం, మల్లేశం,మహమ్మద్ సాబేర్ తదితరులు పాల్గోన్నారు.

# విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దు..

**ప్రశాంతంగా పరీక్షలు రాయండి..!**
**పరీక్షల నిర్వహనకు ఏర్పాట్లు పూర్తి**
**మాస్ కాపీయింగ్ తావివ్వకుండా ప్రకడ్బందీ చర్యలు**
**ప్రజాపక్షం'తో జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇ ఒ) సుశీందర్‌రావు వెల్లడి**



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పదవ తరగతి పరీక్షలను ప్రకడ్బందీగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేశాం. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి అంశాలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాట్లు చేశామని ఇందుకోసం అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం.విధి నిర్వహాణలో నిర్లక్ష్యంగా వ్యవ హరించే ఉపాధ్యాయులను ఉపేక్షించబోం.విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దు. ప్రశాంత మెన వాతావరణంలో పరీక్షలు విజయవంతంగా రాయాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు తెలిపారు.వికరాలంగులు, అంధుల కోసం ఎగ్జామ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పద వ పరీక్షల ఏర్పాట్లపై జిల్లా విద్యా శాఖ అధికారి శనివా రం ప్రజాపక్షం ప్రతినిధి తో మాట్లాడుతూ ఆయన మాటల్లోనే

### జిల్లా లో మొత్తం 239 పరీక్ష కేంద్రాల..50,946 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా 239 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశాం. 50,946 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. 2200 మంది ఇన్విజిలేటర్లను, 239 మంది చీఫ్ సూపరింటిండెంట్లను ఎంపిక చేసి, వారికి శిక్షణ కూడా ఇచ్చాం. మార్చి 18 నుంచి ఏప్రిల్ రెండు వరకు.. ప్రతి రోజు ఉదయం 9.30 నుంఇచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నాం. విద్యార్థులను అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తాం. నిర్దేశిత సమయం తర్వాత వచ్చే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం.

### నిఘా నీడలో పరీక్షలు..

పరీక్షల నిర్వహాణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రశ్నాపత్రాల నిల్వ కోసం 37 కేంద్రాలు ఎంపిక చేశాం. అటు నుంచి పరీక్ష కేంద్రాలకు ఆయా ప్రశ్నాపత్రాలను తరలించేందుకు 10 రూట్లను ఎంపిక చేశారు. ఎంఇఒ స్థాయిలోని తొమ్మిది మంది అధికారులతో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం.అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ సిసి కెమోరాల నిఘా ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశాం. సమీపంలోని జీరాక్స్ సెంటర్లను మూసి వేయాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

### మౌలిక సదుపాయాలు

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం.మంచినీరు, మరుగు దొడ్లతో పాటు ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్లు ఏర్పాటు చేయించాం.పరీక్ష సమయంలో కరెం ట్ పోకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా ఆ శాఖాధికారులకు సూచించాం.విద్యార్థుల రాకపోకల కోసం ఆర్ టి సి ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది.

### విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం విషయంతో శ్రద్ధ వహించాలి. వేళకు పడుకోబెట్టి,వేళకు నిద్రలేపడంతో పాటు ఉదయాన్నే తాజాగా వండివార్చిన ఆహారాన్ని అందించాలి. ఎక్కువ సేపు మేల్కొని ఉండటం వల్ల ఉదయం తలనొప్పితో బాధపడే అవకాశం ఉంది.పరీక్ష సరిగా రాయ లేరు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. పరీక్షల హడావుడీలో పడి చాలా మంది పిల్లలు ఉదయం ఏమీ తినకుండా ఖాళీ కడుపుతో వస్తుంటారు. వడదెబ్బకు గుర్రై,స్పృహ తప్పి పడిపోతుంటారు. ఇలాంటి వారికి తక్షణ వైద్య సేవలు అందించేందుకు అన్ని కేంద్రాల్లోనూ ఎఎన్ఎం, స్టాఫ్ నర్సులను అందుబాటులో ఉంచాం. అవసరమైన మందులు సిద్ధం చేశాం.

### టెన్త్ పరీక్షల షెడ్యూల్ ఇలా

| తేదీ | సబ్జెక్టు |
|---|---|
| 18 | ప్రథమ బాష |
| 19 | ద్వితీయ భాష |
| 21 | ఆంగ్లం |
| 23 | గణితం |
| 26 | భౌతికశాస్త్రం, ( 9.30 నుంచి 11 గంటల వరకు) |
| 28 | జీవశాస్త్రం, (9.30 నుంచి 11 గంటల వరకు ) |
| 30 | సోషల్ (సాంఘిక శాస్త్రం) |
| 01 | ఒకేషనల్ కోర్సు, పేపర్1 |
| 02 | ఒకేషనల్ కోర్సు, పేపర్2 |

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు సజావుగా ,ప్రశాంతంగా జరిగేలా రాజకీయ ప్రజాప్రతినిధులు సహకరించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నియామవళి అమలు విధివిధానాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు వీలుగా సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడకుండా అన్ని జాగ్రతలు తీసుకుంటామన్నారు. ఫ్లెక్సీలు ,బ్యానర్లు ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనలకు ఆటంకం కలిగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిప్యూటి తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి ,బిజేపి ,బిఆర్ఎస్ ,కాంగ్రెస్ , సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా సుజాత

**ప్రజాపక్షం/తాండూరుః** రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేష్ చైర్‌పర్సన్‌గా కల్వ సుజాత నియమితులయ్యారు.ఈ మేరకు శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ముద్దు బిడ్డ కల్వ సుజాతను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్‌పర్సన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గత కొన్నేళ్లుగా ఆమే కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదలలో పార్టీకి సేవలు అందిచడంతో పాటు స్పోక్ పర్సన్‌గా మంచి పేరు సంపాదించారు. గత అసెంబ్లి ఎన్నికలలో తాండూరు ఎంఎల్ఎ సీటు కోసం పోటి పడిన విషయం తెలిసిందే. అయితే రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమేకు ఎంఎల్ఎ సీటు దక్కలేదు. గత కొంత కాలంగా ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటు చేసి నిరుపేదలైన వైశ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమే డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

## గ్లకోమాపై అవగాహన ర్యాలీ




**ప్రజాపక్షం/చర్లపల్లి:** గ్లకోమా అనేది ఆప్టిక్ నరాల హని కల్గించే వ్యాధి అని సోలిస్ డాక్టర్లు అశోక్,ఆనంద్‌లు అన్నారు.ఆదివారం ఇసీఐఎల్ సోలిస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్లకోమా వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. కంటి చూపును కబలించే గ్లకోమా పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని,ఈ వ్యాధితో ఆప్టిక్ నరాల దెబ్బతినడం వల్ల అంధత్వం ఏర్పడుతుందని 40 ఏళ్లు పైబడిన వారు ఈ సమస్య ఎక్కువ వస్తుందని అన్నారు. కోలుకోలేని దృష్టి నష్టానికి గ్లకోమా ప్రధాన కారణమని, గ్లకోమాను ముందుగా గుర్తించడం వల్ల మరింత దృష్టి నష్టాన్ని నివారించవచ్చునని వారు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వద్ద డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.వాతావరణ పరిస్థితిల్లో వివిధ ప్రాంతాల ప్రజల కోసం ఉచితంగా షుగర్,ఆర్థరిటిస్,చర్మ,ఫైల్స్, ఫిస్తుల్లా,థైరాయిడ్,అస్థామా,కిడ్నీ సమస్యలపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని డాక్టర్ చందన్ తెలిపారు.ఈ సందర్భంగా కాలనీవాసులు ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ నర్సింహరెడ్డి, ఎంపల్లి పద్మారెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పిఆర్ఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటలోని సోని దాబా వద్ద హైద్రాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలోని బ్రిడ్జ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో గుర్తు తెలియని మగ వ్యక్తి తీవ్ర గాయలై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. అచూకి తెలిసిన వారు 9490617142, 9490617231 మొబైల్స్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## 'పది' విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఫిర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి పరీక్షలు రాసే పదవ తరగతి విద్యార్థులు అందరికి ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సరైన ప్రణాళికతో విద్యార్థులు అంతా పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల సమయంలో తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. పరీక్ష ప్రారంభ సమయానికి ఆ పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకునే విధంగా ప్రణాళికతో ఉండాలని అన్నారు.

## ఒత్తిడికి లోను కావద్దు

**ప్రజాపక్షం/తాండూరు :** పదవ తరగతి పరీక్షలు విద్యార్థులకు తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న పద పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ధైర్యం పరీక్షలు రాసి విజయం సాధించాలని ఎంఎల్ఎ సూచించారు.రేపటి నుండి పది పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థిని విద్యార్థుళకు అల్ ది బెస్ట్ చెప్పారు. పదిలో మంచి ఉత్తీర్ణతను సాదించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకరావాలని సూచించారు.

## కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అద్రాస్‌పల్లిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లికి చెందిన కరుణాకర్ కూతురు ఏడాదిన్నర వయస్సు గల రుష్మితసాయి ఇంటి ముందు ఆడుకుంటుంది. దీంతో కుక్కలు చుట్టుముట్టి రుష్మితసాయిపై దాడికి పాల్పడ్డాయి. రుష్మితసాయి ముఖంపై కుక్కలు కరువడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబీకులు కుక్కలను చెదరగొట్టారు. చికిత్స నిమిత్తం నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కొరకు ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని తండ్రి కరుణాకర్ బోరున విలపిస్తు తెలిపారు. గతంలో కుక్కలు చిన్నారులపై దాడి చేసిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు వేగవంతం చేయండి



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రి నగర్ లో నూతనంగా శాంక్షన్ అయినా భూగర్భ డ్రైనేజీ పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు తెలియజేయడంతో స్థానికులతో కలిసి పర్యటించి స్థానికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇరిగేషన్, వాటర్ వర్క్స్ సంబంధిత అధికారులను కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, ఈ కార్యక్రమం లో.కాలనీ అధ్యక్షులు టి.మహేందర్ సింగ్, సంజీవ్ రెడ్డి, బ్రిజేష్ (జా) వి.శ్రీరాములు, మహేష్, ఎన్.వెంకట్, సురేష్, చంద్ర శేఖర్, గుండ శ్రీనివాస్, సాయి చరణ్, సతీష్,భూపాల్, మలరాం,రజినీకాంత్, మనోజ్, విజయు, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో
# బిఆర్ఎస్‌కు భారీ షాక్

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ తీర్థం అంటున్న నేతలు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కి భారీ షాక్ తగిలింది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రధాన నేతలు వలసలుగా కాంగ్రెస్‌లోకి క్యూ కట్టారు. నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కొలను కృష్ణారెడ్డి, ప్రగతినగర్ మాజీ ఉపసర్పంచ్ సుధీర్ రెడ్డి, నిజాంరేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ 18వ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, నేతలు దనరాజు, వెంకట్ రెడ్డి, జిత్తు, సందీప్, ఫెరోజ్‌లు కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు సమక్షంలో కొలను వీరేందర్ రెడ్డి, కొలను కృష్ణారెడ్డి, సుధీర్ రెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వర రావు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన నేతలు కొలను వీరేందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సుధీర్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి వచ్చామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలందరికి అందేలా పాటుపడతామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తామని అన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో...**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సుమారు రెండు వందల మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1లో ఏర్పాటు చేసిన సమావేశానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డిలు విచ్చేసి బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, యువకులకు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ప్రభుత్వమని, ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొలను రాజశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కొలను కృష్ణారెడ్డి, గంగాధర్, కొలను బాల్ రెడ్డి, మదుసూదన్ రెడ్డి, రామచందర్ నాయక్ పాల్గొన్నారు.



## బోడుప్పల్ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరిః** బోడుప్పల్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో బోడుప్పల్‌లోని అంబేద్కర్ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపోలు ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా చంటి శ్రీనివాస్, కోశాధికారిగా చిన్నిగళ్ల వినయ్, సలహాదారులుగా చిన్నిగళ్ల కుమార్, దానగళ్ల యాదగిరి, చీరాల జంగయ్య, మీసాల కృష్ణ, రాపోలు రామస్వామి, మీసాల యాదగిరిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు రాపోలు ఉపేందర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయసాధన కోసం పాటుపడుతున్నానని అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం సమస్యలను, హక్కులను పరిష్కరించడంలో కమిటీలో ఉన్న పెద్దలందరిని కలుపుకుని పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీరాల నర్సింహా, కామగళ్ల నర్సింహ, రాపోలు శంకరయ్య, బాలయ్య, మల్లేష్, దానగళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** సోమవారం (నేటి) నుండి ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిష్యత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో మొత్తం 175 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నాట్లు ఆయన తెలిపారు. కోట్‌పల్లి 64, రాంపూర్ 06, ఎన్నారం 11, మొత్కుపల్లి 24, కోట్‌పల్లి కేజీబీవీ 49 మంది విద్యార్థులు కోట్‌పల్లి పరీక్ష కేంద్రంలో రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, శ్యానిటేషన్, పర్నీఛర్ వంటి అన్ని సౌకర్యాలను కల్పించామని ఆయన తెలిపారు.

## కష్టపడి చదివితేనే విజయం

**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు అందరికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివిన దానిని ఇష్టపడి చదివి పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. పదవ తరగతి భవిష్యత్తుకు పునాది వంటిదన్నారు. తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని అన్నారు.

## దామాషా ప్రకారం ఎంపి సీట్లు ఇవ్వాలి




**ప్రజాపక్షం/బోడుప్పల్:** అన్ని రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం ఎంపి సీట్లు కేటాయించి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య డిమాండ్ చేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే అంబేద్కర్ విగ్రహానికి జ్ఞాన మాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సంఘం ఆధ్వర్యంలో ఈ ఆదివారం నాడు 265 వారాలకు చేరుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్‌కు జ్ఞాన మాల వేసి ఆయన ప్రసంగించారు. బహుజన ప్రజలను వేటు వేసే యంత్రాలుగా భావించవద్దని ఆయన రాజకీయ నాయకులకు హితవు పలికారు. జనాభా ఎక్కువగా ఉన్న వారికి చాలా తక్కువ సీట్లు కేటాయించి రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఈసారి ఎన్నికల్లో బహుజనులు అధిక సంఖ్యలో పార్లమెంటు అడుగుపెట్టే విధంగా వారిని గెలిపించాలని, తక్కువ సీట్లు కేటాయించిన వారికి ఓట్లు వేయవద్దని ఆయన పిలుపునిచ్చారు. మాన్యశ్రీ కాన్సీరాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘ సభ్యు లు బొల్లం శశికుమార్ జన్మదినం సందర్భంగా అందరూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, దాసు, అంబేద్కర్ నగర్ అధ్యక్షుడు నత్తి విజయ్‌కుమార్, అంజయ్య, కామగళ్ల బాబు, ఎండి మోహిని దిన్, యేసు రాజు, రాజేష్, సవరపు బయ్యన్న, రాజు, మహేష్ పాల్గొన్నారు.

## అణగారిన వర్గాలకు కార్పొరేషన్ సహకరించాలి

ఎఐటియుసి కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** అణగారిన వర్గాల అభివృద్ధికి నూతన ఎస్సీ కార్పొరేషన్ కార్యవర్గం పని చేసి వారి ప్రగతికి సహకరించాలని ఎఐటియుసి కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు అన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను ఆయన సత్తికుమార్‌తో కలిసి ఆదివారం కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మిరియాల సాయిలు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే అన్ని సంక్షేమ పథకాలన లబ్దిదారులకు అందేలా చూడాలన్నారు. అణగారిన వర్గాల్లో పేదరికం అనుభవిస్తున్న కార్మికులు, రోజు వారీ పనులతో జీవనాలు గడిపే కుటుంబాలు అధికంగా ఉన్నాయని, వారికి అన్ని విధాలా కార్పొరేషన్ పక్షాన చేయూతను ఇవ్వాలన్నారు. దీంతో పాటు వారు ఎదుర్కొనే న్యాయ పరమైన సమస్యలు ఏవైనా ఉంటే వాటి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు.

**ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు**

**ప్రజాపక్షం/చర్లపల్లిః** రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నగారి గారి ప్రీతమ్‌ను ఏఐటియుసి కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.అణగారిన వర్గాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ఎస్‌సి కార్పొరేషన్‌కు కృషి చేయాలని,కార్మికలు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం అవిరాళంగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ పత్తి కుమార్,నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన నగారిగారి ప్రీతంను నాగారం మున్సిపాలిటీ కౌన్సిలర్ పంగ హరిబాబు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పత్తి కుమార్,నాయకులు శ్రీకాంత్,జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపురం నిర్మాణ నమూనా ఫ్లెక్సీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** నేరేడ్‌మెట్ ప్రధాన రోడ్డులో ఉన్న శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం ధ్వజ స్థంభం ముందు నిర్మించ తలపెట్టిన రాజగోపురం నిర్మాణ ప్రాజెక్టును లాంఛనంగా ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సంఘసేవకులు జనగామ రాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఇక్కడ దేవాలయం ఏర్పడి రానున్న సంవత్సరానికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆలయం ముందు రాజగోపురం నిర్మాణం చేపట్టేందుకు ఆలయ కమిటీ విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. దాదాపు 30 లక్షల రూపాయల భారీ వ్యయంతో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బిఎం వెంకట్రావు తెలిపారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు నిర్మాణ పనుల నమూనా రాజగోపురం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్రావు, వైస్ చైర్మన్ జిఎం రమేష్, ఆలయ అధ్యక్షుడు బిఎం రాజారామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.రాజు, ప్రధాన కార్యదర్శి గంగాధరి రాజు, కార్యనిర్వాహణ కార్యదర్శులు బి.సువర్ణలక్ష్మి, జంగిలి, శివకుమార్ ఆలయ సలహాదారులు సామల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


# మాట నిలబెట్టుకున్న సిఎం రేవంత్‌రెడ్డి

మాజీ ఎంఎల్ఎకు వరించిన పదవి



**ప్రజాపక్షం / కొడంగల్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను సిఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మాజీ ఎంఎల్ఏ అయిన గురునాథ్‌రెడ్డికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు ఇచ్చిన మాటను నేరవేర్చి ఔరా అనిపించుకున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో రాజకీయ చరిత్రలో తిరుగులేని నాయకుడు గురునాథ్‌రెడ్డి 5 సార్లు ఎంఎల్ఏగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ హాయంలో ఉన్నప్పుడు గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా వ్యవహరించారు. 2014వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర పార్టీలో చేరడం జరిగింది. అప్పట్లో టీఆర్ఎస్ నుంచి గురునాథ్ రెడ్డి, టిడిపి నుంచి రేవంత్‌రెడ్డి పోటీకి సై అనడంతో రేవంత్‌రెడ్డి గెలుపొందారు. అనంతరం 2018 ఎన్నికల్లో కేసిఆర్ గురునాథ్‌రెడ్డిని కాదని పట్నం నరేందర్‌రెడ్డికి టికెట్ ఇచ్చి రేవంత్‌రెడ్డిపై పోటీకి దింపారు. గురునాథ్‌రెడ్డికి ఎంఎల్‌సి పదవి ఇస్తామని, కార్పోరేషన్ పదవి ఇస్తామని, చాలా ఆశలు చూపి మోసం చేసిన కేసిఆర్‌పై గురునాథ్ రెడ్డి ఆసహానం వ్యక్తం చేస్తు పార్టీకి పార్టీ కార్యక్రమాలకు తన కుటుంబం దూరంగా ఉండి పార్టీలోనే కొనసాగారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పగ్గాలు చేపట్టంతో తరచుగా రేవంత్‌రెడ్డి గురునాథ్‌రెడ్డి మంతనాలు సాగాయి. ఈ తరుణంలోనే 2013 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ సేవలను గుర్తిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కాంగ్రెస్‌లోకి రావడం నియోజకవర్గం నుంచి రేవంత్ గెలుపుకు కృషి చేసి భారీ మేజార్టీతో గెలిపించిన ఘనత గురునాథ్‌రెడ్డికే దక్కుతుంది. ఈ నేపథ్యంలోనే శనివారం విడుదల చేసిన కార్పోరేషన్ పదవిలలో కొడంగల్ మాజీ ఎంఎల్ఏ గురునాథ్‌రెడ్డికి తెలంగాణ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మెన్‌గా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేయడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు రేవంత్‌రెడ్డిని అభినందించారు. ఆదివారం గురునాథ్‌రెడ్డికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభినందనలు తెలిపారు. వీరితో పాటు కొడంగల్ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పిఏసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్‌లతో పాటు తదితరులున్నారు.

## 'అపోలో ఎడ్యుకేషన్ యుకె'



**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఇంగ్లాండ్‌లో తమ కెరీర్‌లో ముందుకు సాగాలని భావించే వైద్య నిపుణులు, విద్యార్థుల కోసం అపోలో మెడికల్ కాలేజీలో 'అపోలో ఎడ్యుకేషన్ యూకె' ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ప్రఖ్యాత ఉక్మాలా, ప్లాబ్ సిఈఓ, ఫౌండర్ డాక్టర్ మోసోభి ప్రత్యేక మాస్టర్ క్లాస్ తీసుకున్నారు. భారతదేశం, ఇంగ్లాండ్ మధ్య వైద్య విద్య శిక్షణా అవకాశాలను మెరుగుపరచడానికి అపోలో ఎడ్యుకేషన్ యూకె అడుగులో ఇది ఒక భాగమని సంస్థ యాజమాన్యం ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ మో సోభి మాట్లాడుతూ ఇంగ్లాండ్‌లో ప్రాక్టీస్ చేయడానికి కావాల్సిన లైసెన్స్ పొందడానికి మూడు దశలు ఉన్నాయన్నారు. అవి ఒకటి ఇంగ్లీష్ పరీక్ష అని, ఇంగ్లీష్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన రెండేళ్లలోపు ఉక్మాలా స్టెప్ 1, స్టెప్ 2 ఈ రెండు పరీక్షలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. దీని కోసం మీరు మెడికల్ డిగ్రీ, ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలన్నారు.

# గంగన్నకుంటను చెరబడుతున్న కబ్జాకోరులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని కుంటలను కబళిస్తూ మట్టితో చదును చేసి ఏకంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఇదే తంతు ఇటీవలే మండల పరిధిలోని డీ.పోచంపల్లిలో వెలుగులోకి వచ్చింది సర్వేనెంబర్ 377లో దాదాపు 2 ఎకరాల పైచిలుకు కుంటలో నిర్మాణాలు చేపడుతున్నారు. పూర్తిగా కుంట కనుమరుగు అవుతుంది కుంట ప్రాంతం లో ఏకంగా పిల్లర్లు వేసి నిర్మాణాలు నిర్మించేశా రు. కొందరు వ్యక్తు లు దుండిగల్ మండలం ప్రాం తాలలో ఏ మూలన కుంటలు చెరువులు కనిపించిన కేటుగాళ్లు మటుమాయం చేసేస్తున్నారు. ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో అక్రమ సంపాదనకు అలవాటూ పడిన కబ్జాకోరులు కుంటలు చెరువులను మింగేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఒకవైపు అధికారులు నిర్మాణాలను తొలగిస్తున్న మరోవైపు కోడి రోజుల సమయం తీసుకుని తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ తంతు దుండిగల్ మండల పరిధిలో అధికంగా జరుగుతున్నాయి. కుంటలు చెరువులు కాపాడాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారుల పై ఉన్నా బాధ్యత మరిచి మరి విధులు నిర్వహిస్తున్నారని కుంటలు చెరువులు కబ్జాలు గురవుతున్న ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సమన్వయంతో చేపట్టాలి కానీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ దాటు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల లోపం తో కబ్జాదారులు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు నిర్మించిన వారిపై శాఖ పరమైన చర్యలు చేపట్టకపోవడంతోనే కబ్జాదారులు దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. తూతూమంత్రంగా చర్యలతో కుంటల ప్రాంతంలో కబ్జాలకు గురవుతున్న నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తేనే చర్యలు చేపట్టడంతో ఫిర్యాదులు రాని నిర్మాణాలను వదిలిస్తున్నారని వాదనలు లేకపోలేదు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తు చర్యలు చేపడుతూనారని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ , రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపం ఉం డడంతో కుంటలు చెరువులను అక్రమార్కులు మింగేస్తున్నారు. అధికారులను స్థానిక నాయకుల నుప్రసనం చేసుకొ ని నిర్మాణాలు చేబాడుతున్నారని అపోహలు లేకపోలేదు ప్లాట్లుగా విభజిం చి నిర్మాణాలు చేస్తున్నారు. కిందిస్థాయి సిబ్బంది పర్యవేక్షణ లోపంతో కబ్జాదారులు నిర్మాణాలు చేపడుతున్నారనీ ఆరోపణలు లేకపోలేదు ఉన్నతాధికారులు దృష్టి సారించి గంగన్న కుంట కబ్జా దా రుల గురి కాకుండా చూడాలని ప్రతిష్టమైన చర్య లు చేపట్టి కబ్జాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



## గిరిజనులకు ఎప్పుడూ అండగా ఉంటాం : ఎంఎల్ఎ అనిరుద్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గంలోని గిరిజనులందరికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాడు ఆయన జడ్చర్ల మండల పరిధిలోని రామస్వామి గుట్ట తండాలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జాతర ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. జాతర ఉత్సవాల్లో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా తండాలలో దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఆయన హామి ఇచ్చారు. పెద్దెత్తున సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలు జరుపుకోవడం గర్వించదగిన విషయమని అన్నారు. అంతకుముందు తండాకు వచ్చిన ఆయనకు గిరిజన సంఘ నాయకులు , ఉత్సవ కమిటీ సభ్యులు పూలమాలలు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వందరోజుల పాలనపై ప్రజలు సంతృప్తి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వందరోజుల పాలనపై రాష్ట్రప్రజలు సంతృప్తిగా సంతోషంగా ఉన్నారని నాగర్‌కర్నూల్ మాజీ ఎంపి, టిపిసిసి సీనియర్‌వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మల్లురవి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో సామూహిక నాయకత్వం ప్రభుత్వం పునరుద్ధరించబడింది. ప్రభుత్వంలో సామూహిక నాయకత్వం సమ్మిళిత వృద్ధిని స్థాపించారన్నారు. పోస్టింగ్ చైర్మన్లు, మంత్రి, ఎన్నికలముందు ఇచ్చిన ముఖ్యమైన హామీలు అమలు చేస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ప్రక్రియ అత్యంత ప్రాధాన్యతతో సజావుగా సాగుతోందన్నారు. ధరణి సమస్యలను వందరోజుల్లో పరిష్కరిస్తున్నారన్నారు. తమ సమస్యల పరిష్కారంకోసం ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులను చేరుకోవడానికి ప్రజలకు తలుపులు తెరిచి ఉన్నాయన్నారు.



## ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు : వెంకటయ్య

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రేమపేరుతో అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలుతప్పవని షీటీమ్ అధికారి వెంకటయ్య అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సార్వత్రిక అధ్యయన కేంద్రంలో ఆడిషనల్ ఎస్‌పి రామేశ్వర్ ఆదేశాలమేరకు షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్‌డిగ్రీ విద్యార్థులకు షీటీమ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో సోషల్‌మీడియా ప్రభావంవలన టెక్నాలజి పెరిగిపోవడం వలన అమ్మాయిలపై దాడులు పెరిగిపోతున్నాయని దీనిని ధైర్యంగా ఎదుర్కొవాలని విద్యార్థులకు సూచించారు. సోషల్‌మీడియాలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అమ్మాయిలను ఎవరైన బ్లాక్‌మెయిల్‌చేస్తే ఎటువంటి భయాందోళనకు గురికాకుండా వెంటనే షీటీమ్‌నెంబర్ 8712657676కు , 100నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం ఇచ్చినవారిపేరు బయటకు రాకుండానే మూడో కంటికి తెలియకుండా వారి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎటువంటి పరిస్థితులోలైను అమ్మాయిలను వేధిస్తున్న వారిపై పోలీసుశాఖ ఉపేక్షించేది లేదని ఆకతాయిలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్‌డిగ్రీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మసిగంటి రమేష్‌బాబు అనేవ్యక్తి బ్రెయిన్‌డెడ్ ఆపరేషన్ జరగడంవలన ఇంట్లోనే ఉంటున్నాడు. అతని భార్య ఈమధ్య క్యాన్సర్‌తో మరణించింది. వీరికి ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. వారి బాగోగులకోసం మిత్ర ఫౌండేషన్ తరపున రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశపుహాల్లో ఉంటుందని ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, ఎంపిడిఓ దేవరకొండ నాగేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు సర్వసభ్య సమావేశం ఉంటుందని ఈసమావేశానికి ఎంపిటిసిలు గ్రామపంచాయతీలపాలన అధికారులు హాజరుకావాలని, మండల ప్రభుత్వ వివిధశాఖల అధికారులు ప్రస్తుత ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

## ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా సిజెఆర్



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావును రాష్ట్రప్రభుత్వం నియమించింది. సిజేఆర్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టి శుభ సందర్భంగా కొల్లాపూర్ మున్సిపాలిటి 12వవార్డు కౌన్సిలర్ కిరణ్‌తేజగౌడ్ ఆదివారం సిజేఆర్ నివాసంలో శాలువాతో సన్మానించారు. కొల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ నాయకులు సిజేఆర్ అభిమానులు సిజేఆర్‌కు హార్థిక శుభాకాంక్షలు తెలుపుతూ సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత బిఆర్‌ఎస్ పాలనలో కొల్లాపూర్ నియోజకవర్గంలో సిజేఆర్ కాంగ్రెస్‌పార్టీకి పెద్దదిక్కైపార్టీని కార్యకర్తలను కాపాడారని సిజేఆర్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో ఆర్టిక్స్ ఎగ్జిబిషన్–2024


### కళలను ప్రపంచస్థాయిలో చాటి చెప్పేలా ప్రదర్శన



**హైదరాబాద్ :** వేయి మాటల్లో చెప్పలేని భావాలను ఒక చిత్రం చెబుతుంది. అలాంటి చిత్రాలన్నీ ఒకచోట చేరితే చిత్రకారులకు, అభిమానులకు అంతకంటే ఆనందం మరొకటుండదు. అలాంటి వేదికను ఆర్టిక్స్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశంలో పేరొందిన చిత్రకారుల చిత్రాలు, ఇతర కళారూపాలను ఒకచోట చేర్చింది. ఆరుషి ఆర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో ప్రాచీన భారత కళలను చాటి చెప్పేలా గీసిన చిత్రాలు, వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. ఢిల్లీ, ముంబయి, పుణె, గుజరాత్, చెన్నై, బెంగళూర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారులు వేసిన పలు రకాల పెయిటింగ్స్‌ను ప్రదర్శనగా ఉంచారు. హైదరాబాదకు చెందిన లక్ష్మణ్ ఏలె, లక్ష్మ గౌడ లాంటి ప్రముఖ చిత్రకారుల చిత్రాలు సైతం ఆర్టిక్స్‌లో ప్రదర్శనగా ఉంచారు. మను ఫరేఖ్, ఎంఎఫ్ హుస్సేన్ గీసిన చిత్రాలు ప్రదర్శనలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూణెకు చెందిన నారయణ్ అనే చిత్రకారుడు గోల్ఫ్ ఆటగాళ్లరేసులో ఉన్న అంశంతో గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. శతాబ్దాల క్రితం చిత్రకారులు ఎంతో అందమైన చిత్రాలు గీశారు. ఆ తరహా ఆర్ట్ క్రమంగా కనుమరుగైపోయింది. ఆధునిక చిత్రకారులు ఆ తరహా చిత్రాలను గీస్తూ గతంలో చిత్రకారుల్లో ఉన్న ప్రతిభ గురించి చాటి చెబుతున్నారు. ప్రాచీన భారతాన్ని చాటిచెప్పే విధంగా ఢిల్లీకి చెందిన ఆంచల్ గార్గ్ గీసిన చిత్రాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. 'అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రముఖ చిత్రకారులు వేసిన పలురకాల పెయిటింగ్స్‌ను ప్రదర్శనగా ఉంచారు. ఆర్టిస్టులందరూ వివిధ రకాల మెటీరియల్ ఉపయోగించి చిత్రాలు గీశారు. వీటిని ఒక్కసారి చూస్తే వీరు ఎలా ఇలా ఆలోచించగలిగారని ఆశ్చర్యమేస్తుంది. క్యాలెండర్స్, పాత వస్తువులను సేకరించి అందమైన చిత్రాలను గీశారు. ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు ప్రముఖ చిత్రకారులు వచ్చి చిత్రాల ప్రాధాన్యతను అడిగి తెలుసుకుంటున్నారు' అని అలేఖ్య హోమ్స్ ఎండి శ్రీనాథ్ అన్నారు. ఆరుషి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ వివిధ కళాకృతులు అబ్బురపరుస్తున్నాయి ఆరుషి ఆర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన గురించి ఇప్పటికే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించారు. గతంలో ఈ తరహా ప్రదర్శనలు దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు, హాంకాంగ్, సింగపూర్, పారిస్, లాస్ ఏంజిల్స్, లండన్ లో నిర్వహించారు. ఎంతో పేరున్న ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు ప్రముఖ చిత్రకారులు సైతం వచ్చి చిత్రాల ప్రాధాన్యతను అడిగి తెలుసుకుంటున్నారు. చిత్రకారులతో పాటు అభిమానులు ఎంతో మంది ఈ ప్రదర్శనను తిలకిస్తున్నారు. నచ్చిన చిత్రాలను, కళాకృతులను లక్షల రూపాయలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

## పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి

### ఎంఎల్ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ కి చెందిన యాదవ యువ నాయకులు ఈరోజు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఆదేశానుసారం వివిధ పార్టీలకు చెందిన నాయకులను, కార్యకర్తలను పార్టీ లో చేర్చుకోవడం జరుగుతుందని, ఆయన స్పష్టం చేశారు. పార్టీ లో చేరిన ఏ కార్యకరకు అయినా సముచిత స్థానం కల్పించి, బాధ్యతలు కూడా అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే ఎంపి ఎన్నికల్లో, ఎమ్మెల్యే ఎన్నికల్లో కంటే ఎక్కువ మెజారిటీతో మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు ఎంపి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహుమతి గా ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, మహబూబ్ నగర్ మున్సిపల్టీ లోని 49 కౌన్సిలర్ లను రాబోయే ఎన్నికల్లో గెలిపించుకోవాలని, సర్పంచ్ ఎంపిటిసి ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. బిఆర్ఎస్ పార్టీ లో కేవలం ఆ కుటుంబ సభ్యులే మిగులుతారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను బెదిరించి, పీడించిన బిఆర్ఎస్ నాయకులు ఒక్కోక్కరు ఇక జైలు పాలు కాక తప్పని పరిస్థితి అని ఆయన స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎన్ పి వెంకటేష్ , మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సిజె బెనహర్, సుధాకర్ రెడ్డి, ముకుంద్ రమేష్ , ఐఎన్‌టియుసి రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం చేసిన బాల్య మిత్రులు



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని యాపర్ల గ్రామంలో ఉండే కురుమూర్తి అనే బాల్య మిత్రుడు ఆనారోగ్యం కారణంగా అతని కూతురికి పెళ్లి చేయడానికి, బాల్య మిత్రులందరూ కలిసి రూ. 3 లక్షల ఆర్థిక సహాయం చేశారు. మిత్ర బృందం అందరు గాంధీ హై స్కూల్ కొల్లాపూర్‌లో చదువుకున్నారు. జగదీష్ సిఐ గచ్చిబోలి, ప్రభాకర్ ఏఓ, సురేష్ హెచ్‌సి, వెంకటరమణరెడ్డి, గాండ్ల శంకర్ , డాక్టర్ భీమానాయక్ , మిగతా మిత్రులు 1987 10వ తరగతి బ్యాచ్ గాంధీ హై స్కూల్ వారు ఆర్థిక సహాయం అందించారు. ఇది తెలుసుకున్న గ్రామ పెద్దలు వారి టెన్త్ క్లాస్ స్నేహితుడు ఇబ్బందుల్లో ఉన్నాడనే విషయాన్ని తెలుసుకొని కూతురు వివాహానికి రూ. 3 లక్షలు సహాయం చేయడం ఎంతో గర్వించే విషయమని, 1987 గాంధీ హై స్కూల్ చదివిన బ్యాచ్ మిత్ర బృందాన్ని గ్రామస్తులు అభినందించారు.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ప్రజాపక్షం / కొత్తకోట : కొత్తకోట మండల పరిధిలోని ముమ్మలపల్లి గ్రామంలో బుడగ జంగం కాలనీలో ఎడవల్లి సరోజకు క్యాన్సర్ బారిన పడటం వల్ల ఆర్థిక పరిస్థితులతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆరో వార్డుకు చెందిన జయప్రకాష్ కాలనీ బుడగ జంగం కాలనీ వాసులు రూ. 5,938 , బుడగ జంగం మండలాధ్యక్షుడు సిరిగిరి ఈశ్వర్ రూ. 50కేజీల బియ్యం, ఐదు లీటర్ల మంచి నూనెను ఆర్థిక సహాయం సరోజా భర్త యడవల్లి మన్యంకు ఆదివారం తన నివాసం దగ్గర అందజేశారు. ఈ కుటుంబం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం ఈమెకు ముగ్గురు సంతానం , ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు , కుమారుడు మూగివాడు ఎవరైనా దాతలు మీకు తోచిన సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఎవరైనా సహాయం చేయవాల్సిన వారు ఉంటే 9704872515, 7660880618 కు ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిరువాటి మహేష్ , జగదీష్ , ఈశ్వర్ , జమ్మన్న, లక్ష్మన్న, మన్యం, చింతలయ్య, ఎల్లప్ప, ఈశ్వర్ , కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలిని పరామర్శించిన నాయకులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు భీమా ప్రసన్న లక్ష్మీ బంగారయ్య ఇటీవల కిమ్స్‌లో ఆర్థోపెటిక్ ఆపరేషన్ చేసుకొని డిశ్చార్జ్ అయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్ , కౌన్సిలర్లు ఖాజామైనోద్దీన్ , ఎరుకలి ఇ తిరుపతయ్య, రాంమోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్ , బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ వినోద్ సాగర్ , పీజీ రవి తదితరులు పరామర్శించారు. అనంతరం ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మరో ధైర్యం ఇచ్చారు.

## కవితను కలిసిన కెటిఆర్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ, మనీలాండరింగ్ కేసుల్లో ముద్దాయిగా ఉన్న తన సోదరి, తెలంగాణ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను బిఆర్ఎస్ నాయకుడు కెటి రామారావు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కార్యాలయంలో ఆదివారం కలుసుకున్నారు. 46 ఏళ్ల కవితను శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో అరెస్టు చేసిన ఇడి అధికారులు ఆమెను ఢిల్లీకి తరలించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు ఆమెను ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కోర్టు ముందు హాజరుపరచగా, కోర్టు ఆమెను ఈనెల 23వ తేదీ వరకూ ఇడి కస్టడీకి పంపింది. రిమాండ్‌లో ఉన్న సమయంలో ఆమె సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య తన కుటుంబ సభ్యులను కలుసుకనే అవకాశం కల్పించింది. ఈ వెసులుబాటును ఉపయోగించుకొని కెటిఆర్‌తోపాటు కవిత భర్త అనిల్ తదితరులు ఇడి కార్యాలయానికి వెళ్లారు. కోర్టు ఇచ్చిన అనుమతి మేరకు వారు కవితను కలిసినట్టు అధికార వర్గాలు తెలిపారు.
కవితను ఈడీ కస్టడీకి పంపుతున్న సమయంలో, ఆమె రిమాండ్ వ్యవధిలో ప్రతిరోజూ సాయంత్రం 67 గంటల మధ్య ఆమెను కలిసేందుకు సోదరుడు కేటీఆర్ మరియు భర్త అనిల్ డితో సహా కొంతమంది బంధువులను కోర్టు అనుమతించింది. దేశ రాజధానిలో మద్యం లైసెన్సుల్లో అధిక వాటాకు బదులుగా ఢిల్లీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు రూ. 100 కోట్ల కిక్‌బ్యాక్స్ చెల్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న 'సౌత్ గ్రూప్'లో కవిత కీలక సభ్యురాలు.

## రాష్ట్రపతి ఆమోదానికి ఇసిఐ సిఫార్సు!

**న్యూఢిల్లీ:** ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలను నిర్వహించాలన్న భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సిఫార్సును కేంద్ర ప్రభుత్వం ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. తద్వారా లోక్‌సభ ఎన్నికల తేదీల నోటిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించిందని పిటిఐ తెలిపింది. 102 స్థానాలకు ఏప్రిల్ 19న తొలి దశ ఎన్నికలకు ఈనెల 20న తొలి నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇసిఐ శనివారం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 18వ లోక్‌సభకు ఎన్నికలు ఏప్రిల్ 19న ప్రారంభమవుతాయి. ఆ తర్వాత ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, చివరిగా జూన్ 1న తదుపరి దశల్లో పోలింగ్ జరుగుతుంది. కాగా, ఆదివారంఉదయం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో వివిధ దశలకు నోటిఫికేషన్లు జారీ చేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 14 (2) ప్రకారం ఇసిఐ తన సిఫార్సును ప్రభుత్వానికి పంపుతుంది, ఇది ఎన్నికల తేదీల నోటిఫికేషన్‌ను క్లియర్ చేయమని రాష్ట్రపతిని అభ్యర్థిస్తుంది. సిఫార్సు ఆధారంగా, న్యాయ మంత్రిత్వ శాఖ కేంద్ర కేబినెట్ కోసం ఒక ప్రతిపాదనను సిద్ధం చేస్తుంది. ఇది వివిధ దశల నోటిఫికేషన్ల జారీని ఆమోదించాలని రాష్ట్రపతికి సూచిస్తుంది. ఎన్నికల సంఘం సిఫార్సు చేసిన తేదీ లేదా తేదీలను భారత గెజెట్‌లో ప్రచురిస్తారు. దాని ఆధారంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ నోటిఫికేషన్ల ద్వారా, లోక్‌సభ సభ్యులను ఎన్నుకునే ప్రక్రియకు అధికారిక రూపం వస్తుంది.

## పెట్రో ధరల్లో ఎపి టాప్

### తర్వాతి స్థానాల్లో కేరళ, తెలంగాణ రాష్ట్రాలు



**న్యూఢిల్లీ:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆంధ్రప్రదేశ్‌లో అధికంగా ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో కేరళ, తెలంగాణ రాష్ట్రాలున్నాయి. లక్షద్వీప్, అండమాన్ నికోబార్, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో పెట్రో ధరలు అతి తక్కువగా ఉండ టం గమనార్హం. స్థానికంగా సేల్స్ టాక్స్ లేదా వ్యాట్ రేట్లలో వ్యత్యాసం వల్లే ధరల్లో ఈ మార్పులు చోటుచేసున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన ముందు ఆయిల్ కంపెనీలు లీటరుపై రూ.2 తగ్గించినప్పటికీ అనేక రాష్ట్రాల్లో వీటి ధరలు వంద రూపాయల దిగువకు చేరలేదు. వైసిపి అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.109.87గా ఉంది. దేశంలోనే ఇది అత్యధికం. ఎల్ఇఎఫ్ కూటమి అధికారంలో ఉన్న కేరళలో రూ.107.54, కాం గ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణాలో పెట్రోల్ ధర రూ.107.39గా ఉన్నాయి. బిజెపి పాలిత ప్రాంతాల్లోనూ పెట్రోల్ ధరలు అధికంగానే ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో (భోపాల్) రూ. 106.45, బిజెపి–జెడియు కూటమి ప్రభుత్వమున్న బీహార్‌లో (పాట్నా) రూ.105.16, రాజస్థాన్‌లో 104.86, ముంబయిలో రూ.104.19గా ఉన్నాయి. మమతా బెనర్జీ టిఎంసి అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో పెట్రోల్ ధర రూ.103.93, ఒడిశా రూ.101.04, తమిళనాడు 100.73, ఛత్తీస్‌గఢ్ రూ.100.37లుగా ఉన్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. అండమాన్ అండ్ నికోబార్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.82గా ఉంది. సిల్వస్సా, దామన్ దీవ్‌లో రూ.92గా ఉంది. ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.94.76, గోవాలో రూ.95, ఐజోల్ (మిజోరం)లో రూ.93, గువహటి(అసోం)లో రూ.96గా ఉన్నాయి.

**డీజిల్‌లోనూ ఆంధ్రా టాప్....**

డీజిల్ ధరలు కూడా ఇదే రీతిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా లీటరు ధర రూ.97.6గా ఉండగా, తిరువనంతపురం(కేరళ)లో రూ.96.41, హైదరాబాద్ (తెలంగాణ)లో రూ.95.63, రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లో రూ.93.31గా ఉన్నాయి. మహారాష్ట్ర, బీహార్‌లలో లీటరు డీజిల్ ధర రూ.9293గా ఉన్నాయి. ఒడిశా, జార్ఖండ్‌లలోనూ ఇదే విధంగా ఉన్నాయి. అతి తక్కువగా అండమాన్ నికోబార్ లో (రూ.78) ఉండగా.. ఢిల్లీ, గోవాలలో డీజిల్ లీటరుకు రూ.87గా కొనసాగుతున్నాయి.

## రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఓట్ల లెక్కింపు తేదీ మార్పు

**జూన్ 2వ తేదీనే అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు**

**లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు యథాతథం**



**న్యూఢిల్లీ :** అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సం ఘం కీలక మార్పులు చేసింది. వాస్తవానికి ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఓట్ల లెక్కింపు లోక్‌సభతోపాటే జూన్ 4న చేపట్టనున్నట్లు ఇసి శనివారం ప్రకటించింది. అయితే.. వీటి అసెంబ్లీల గడువు జూన్ 2కే ముగియనుంది. దీంతో జూన్ 4న బదులు.. జూన్ 2నే ఈ రాష్ట్రాల్లో కౌంటింగ్ చేపట్టి, మొత్తం ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఎన్నికల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. ఇక్కడి పార్లమెంటు స్థానాల ఓట్ల లెక్కింపులో ఎలాంటి మార్పులు లేవని వెల్లడించింది. కాగా, 60 అసెంబ్లీ సీట్లు కలిగిన అరుణాచల్ ప్రదేశ్‌లో ఏప్రిల్ 19న ఒకే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. బిజెపి, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఒక స్వతంత్రుడితో కూడిన ఎన్‌డిఎ కూటమి పాలన సాగుతోంది. సరిహద్దు ప్రాంత అభివృద్ధి, మౌలిక సదుపాయాలు ఎన్నికల అంశాలుగా ఉన్నాయి. సిక్కింలో మొత్తం 32 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈ రాష్ట్రంలోనూ ఏప్రిల్ 19న ఒకే దశలో పోలింగ్‌కు షెడ్యూల్ విడుదలైంది. బిజెపి, సిక్కిం క్రాంతికారి మోర్చాలతో కూడిన ఎన్‌డిఎ కూటమి అధికారంలో ఉంది. మహిళా సంక్షేమ పథకాలు, అవినీతే ప్రధాన ప్రచారాంశాలు.

## పట్టణ కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షునిగా శ్రీనివాసులు



**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట పట్టణ బీసీ సెల్ అధ్యక్షులుగా బి. శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా మల్లేష్ యాదవ్ , కమ్మరి విజయ్ , బిక్కిం కృష్ణయ్య, కార్యదర్శిగా ఉప్పల నరేందర్ , ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వి. రాజు, చిన్న నాగన్న, బి. పవన్‌లను ఎన్నుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డికి కమిటీకి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు బొల్లి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. మాపై ఉంచిన నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నమ్మకంతో పని చేస్తామని తెలిపారు.

## బిఆర్ఎస్‌కు తాటిపాముల ఎంపిటిసి గుడ్‌బై



**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :** మండల పరిధిలోని తాటిపాముల గ్రామ ఎంపీటీసీ అంకె పార్వతమ్మ ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. గ్రామ మండల నాయకుల సమక్షంలో ఎంపీటీసీతో పాటు మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంకె వెంకటయ్య, మాజీ సర్పంచ్ గంధం బజారు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పాలనలో ఎంపీటీసీలకు ఎలాంటి గుర్తింపులేదని, ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని నేడు కాంగ్రెస్ పార్టీ తమను గుర్తించి ప్రాధాన్యత కల్పించడం సంతోషదాయకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీరం రాజశేఖర్‌రెడ్డి, సత్యశీలారెడ్డి, గంధం రాజశేఖర్ , కురుమన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచల్ ప్రదేశ్ మా భూభాగమే

### చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వ్యాఖ్య

**బీజింగ్:** అరుణాచల్ ప్రదేశ్ ఎప్పుడూ చైనా అంతర్లీన భూభాగమేనని ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి, సీనియర్ కల్నల్ జాంగ్ జియోగాంగ్ వ్యాఖ్యానించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనపై బీజింగ్ అభ్యంతరం వ్యక్తంచేయగా, భారత్ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో జియోగాంగ్ అరుణాచల్ ప్రదేశ్‌ను తమ దేశ అంతర్భాగంగా పేర్కోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. చైనా అధికారిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జిజాంగ్ దక్షిణ భాగం (టిబెట్‌కు చైనా పేరు) చైనా భూభాగంలోనిదేనని అన్నారు. చట్ట విరుద్ధంగా ఏర్పాటైన అరుణాచల్ ప్రదేశ్‌ను భారత భూభాగంగా ఎప్పటికీ అంగీకరించేది లేదని జియోగాంగ్ స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని ఆయన దక్షిణ టిబెట్‌గా అభివర్ణించారు. ఇలావుంటే, అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా ప్రాదేశిక వాదనలను భారత దేశం అనేక సందర్భాల్లో తిరస్కరించింది. ఆ రాష్ట్రం దేశంలో అంతర్భాగమని పేర్కొంది. ఆ ప్రాంతానికి జాంగ్నాన్ అని చైనా పేరుపెట్టడాన్ని కూడా ఖండించింది. ఇలాంటి చర్యలువాస్తవాన్ని మార్చలేవని తెలిపింది. ఈనెల 9న ప్రధాని మోడీ అరుణాచల్ ప్రదేశ్‌లోని పశ్చిమ కమెంగ్ జిల్లాను కలిపే రహదారిపై రూ. 825 కోట్లతో నిర్మించిన సొరంగ మార్గాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోనే ఇంత ఎత్తులో అతి పొడవైన ద్విలేన్ రహదారి మరెక్కడా లేదు. సెలా టన్నెల్ చైనాతో ఉన్న వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఎసి) వెంబడి వివిధ ఫార్వర్డ్ లొకేషన్లకు దళాల పంపడానికి, ఆయుధాలు చేర్చడానికి ఉపయోగపడుతుందని భారత సైనిక అధికారులు ప్రకటించారు.



## బత్తాయి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి : లక్ష్మీ

**ప్రజాపక్షం/నల్లగొండ :** కష్టకాలంలో బత్తాయి సాగు చేస్తున్న రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉద్యానవన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి సంగీత లక్ష్మీ అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎస్‌బిఆర్ గార్డెన్‌లో బత్తాయి రైతుల సమస్యల పరిష్కారానికై రాష్ట్ర స్థాయి బత్తాయి రైతుల సదస్సు ఆదివారం నిర్వహించారు.ఈ సదస్సుకు ఆమె పాల్గొని మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు 2 లక్షల బత్తాయి నాణ్యమైన మొక్కలు, పనిముట్లు ప్రభుత్వ రాయితీతో అందించేందుకు ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని అన్నారు. రైతుల అవసరాల కోసం క్లస్టర్ల డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద దేశవ్యాప్తంగా ఒకే జిల్లా ఒకే క్రాపు కింద బత్తాయి, నిమ్మ ఉందని ఇప్పటివరకు జిల్లాలో సాగవుతున్న పండ్ల తోటల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక ద్వారా పంపిస్తున్నామని తెలిపారు. ఆచార్య కొండా లక్ష్మణ్ తెలంగాణ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు టి.సురేష్ రెడ్డి, రాజు గౌడ్ మాట్లాడుతూ బత్తాయి సాగులో యజమాన్య పద్ధతులు, సంరక్షణ చర్యలు క్రమం తప్పకుండా తీసుకుంటే అధిక దిగుబడితో పాటు లాభాలు పొందవచ్చని సూచించారు. బత్తాయి రైతు సంఘం నాయకులు నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులను నిరంతరం కరువు కాటకాలు వెంటాడుతున్నా జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో బత్తాయి సాగు జరుగుతుందన్నారు. 50శాతం రాయితీతో పనిముట్లు ఇవ్వాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, గురుకుల హాస్టళ్లు ,అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పండ్లలో బత్తాయి పండ్లను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాబార్డు డిడియం వినయ్ కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, ఎ.సుబ్బారావు, నకిరేకల్ ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్, రైతులు అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, అరవిందరావు, సంధ్యారాణి, శ్వేత, అన్నపూర్ణ, శేఖర్, నెహ్రూ, జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

## రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ఆరుగాలం పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలో సిపిఐ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారని, మోడీ ప్రభుత్వం రైతుల పట్ల వివక్షత చూపుతున్నారన్నారు.భూగర్భజలాలు ఎండిపోయిన రైతులు తమ పంటలు కాపాడుకోవటం కోసం ఆహర్నిశలు కష్టపడుతున్నారని తీరా పంట చేతికొచ్చేసరికి మిల్లర్లు సరై గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారని మిల్లర్లు సిండికేట్ వ్యాపారం చేస్తూ రైతుల పొట్ట కొడుతున్నారన్నారు. మిర్యాలగూడ పరిధిలోని రైస్ మిల్లర్లు రైతులను నిలువున దోచుకుంటున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు మిల్లర్లతో మాట్లాడి గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి , ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కొమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.

## ‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్:** పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ ఎఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్ అన్నారు. భువనగిరిలో ఆదివారం మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో అన్ని సెంటర్లలో విద్యుత్, మంచి నీటి లాంటి మౌళిక సౌకర్యాలు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ర్యాంకుల కోసం కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్డదారులు తొక్కకుండా పరీక్షా కేంద్రాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని అలా జరిగిన నేపథ్యంలో ఆ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసవి దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు నీరసం కాకుండా ప్రథమ చికిత్స నిమిత్తం ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆశా కార్యకర్తలు ఏఎన్ఎం అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ ఆరోగ్యశాఖ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అటువంటి వాటికి విద్యాశాఖ అధికారులు అడ్డుకట్ట వేయాలని విద్యార్థులు మనో ధైర్యం తో పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత శాతం తీసుకురావాలని పదవ తరగతి విద్యార్థులు అందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నామని చెప్పారు.

## ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సు, డీసీఎం వాహన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఎంజీఎం హాస్పిటల్ కి వెళ్లి సిపిఐ బృందం పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, బస్సు ప్రమాదంలో గాయపడిన ముగ్గురు మహిళలను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. తీవ్రంగా గాయపడిన వారిలో బొల్లి సమ్మక్క, దుర్గం రాజేశ్వరి, మంతనే లావణ్య ఈ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. వెంటనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు,జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా చొరవ చూపి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అదే విధంగా వారికి నష్టపరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. తీవ్ర గాయాలు అయ్యి విషమంగా వున్నా ఈ ముగ్గురు మహిళలను హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వేముల శ్రీకాంత్, బొడ్డు మనోజ్,వాసం రజిత మౌనిక, రాజేష్ పరామర్శించారు.

## బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం

**ప్రజాపక్షం/గుండాల :** మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిపిఐ గుండాల మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు నెల నెల బిల్లులు రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు మూడు వేల రూపాయల వేతనం ఇస్తామని నేటికి అమలు కాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి, కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించి, వంటగ్యాస్ సబ్సిడి, వంట పాత్రలు, మౌలిక సదుపాయాలు, యూనిఫాంలు ఇవ్వాలని కోరారు.

## పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, ఎర్ర జెండా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హసన్‌పర్తి మండలంలోని సుబ్బయ్యపల్లి గ్రామం నుంచి 20 మంది వివిధ పార్టీల కార్యకర్తలు సీపీఐలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేదల తరపున వారి సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే అన్నారు. భూర్జువా పార్టీలకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని, ఎర్రజెండా పార్టీలు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటాయన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం వేలాది మందిని సమీకరించి భూ పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐదేనన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించుకునేందుకు సిపిఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు మోతె లింగారెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి, మునిగాల బిక్షపతి, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త గనులతోనే సింగరేణికి భవిష్యత్తు

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు (ఎఐటియుసి) సీతారామయ్య



**ప్రజాపక్షం / నస్పూర్ :** సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుతోనే భవిష్యత్తు ఉందని, దాంతో కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు (ఎఐటియుసి) వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలోనే సింగరేణికి ఇచ్చిన తాడిచర్ల 2బ్లాక్ తిరిగి సంస్థకు అప్పగించడం జరిగిందన్నారు. మిగిలిన 3 బ్లాకులు కూడ సింగరేణికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రానికి, సిఎం, మంత్రులకు లేఖలు రాయడం జరిగిందన్నారు. అలాగే కొత్త ప్రాజెక్టులు సాధించుకోవడానికి యాజమాన్యం వేలంలో పాల్గొని దక్కించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు టెండర్లో పాల్గొనడానికి రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. తాడిచర్ల బ్లాక్ సింగరేణి కి రావడం వలన 800 ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. సింగరేణిలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్లు 108 పోస్టులు భర్తీ చేయడానికి యాజమాన్యం అన్ని కేటగిరిల వారికి అనుమతి ఇవ్వడానికి అంగీకరించిందన్నారు. కార్మికులకు ఉద్యోగ అర్హత వయసు 35 నుంచి 40 సంవత్సరాల పెంపుకు హామీ ఇచ్చిందని, దాంతో 600 మందికి ఉద్యోగాలు దొరుకుతాయని, మారుపేర్ల సవరణకు ప్రభుత్వము హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న సిఎం పిఎఫ్ రుణాలు త్వరలోనే ఇవ్వడానికి ట్రస్ట్ హామీ ఇచ్చిందని అన్నారు. బదిలీలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూస్తామన్నారు. క్వార్టర్లు రిపేరు చేయించిన తర్వాతనే కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారుల బదిలీలలో నిబంధనలను అతిక్రమిస్తే ఊరుకోమని హెచ్చరించారు. సింగరేణిలో 1000 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. అంతర్గత కార్మికులకు ముందు 60 శాతం, బయటి వారికి 40 శాతం అవకాశం కల్పించాలన్నారు. అనుభవం ఉన్న కార్మికులతో ముందు ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ మేరకు 300 అంతర్గత పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని కార్మికులు అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది అన్నారు, ఎమ్మెల్యేల పేర్లు చెప్పి అధికారుల వద్ద అజమాయిషి చలాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తాము ఎంఎల్ఎ దగ్గరికి ఈ విషయం తీసుకెళ్లగా, తాను ఎవరికి ఏ విషయంలో అధికారులకు చెప్పలేదని పేర్కొన్నట్లు వివరించారు. అధికారులు కూడా వారి తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అక్రమాలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి డిప్యూటీ ఉప ప్రధాన కార్యదర్శి కె. వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, ఫిట్ కార్యదర్శులు నర్సింగరావు, బుచ్చయ్య, శివకుమార్, రామచందర్, యాదగిరి, నగేష్, సదానందం, నాయకులు సతీష్ పాల్గొన్నారు.

## పండించిన పంటను అమ్మేందుకు రైతు తిప్పలు

మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

స్థానిక రైస్‌మిల్ ఎదుట ధాన్యం పోసి నిరసన తెలిపిన రైతు



**ప్రజాపక్షం/వేములపల్లి :** ఆరుగాలాలు శ్రమించి పండించిన పంటను రైతు అమ్ముకునేందుకు నానా తిప్పలు పడాల్సిన పరిస్థితితప్పడం లేదు. ఓవైపు ప్రకృతి సహకరించక సకాలంలో వర్షాలు పడకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోరు బావులు సైతం ఎండిపోవడంతో చేతి కందే పంట ఎక్కడ చేజారి పోతుందోనని రైతు నీటి కోసం నానా కష్టాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. కొద్దో గొప్ప పండిన పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయకపోవడంతో అందుబాటులో ఉన్న మిల్లుల వద్దకు రైతులు ధాన్యాన్నితీసుకొని వెళితే మిల్లర్లు సిండికేట్ గా మారి తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం వెళ్ళని పరిస్థితి నెలకొందని తమ ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఓవైపు పంట పండించేందుకు పెట్టుబడులు అధికమవడంతో పాటు తీరా పండిన పంటను అమ్మే సమయంలో సరైన గిట్టుబాటు ధర అందక రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొందని తమ గోడు వెలిబుచ్చుతున్నారు. దీనికి తోడు పంట పొలాలకు దగ్గరలోనే రైస్ మిల్లులు ఏర్పాటు చేయడంతో దాని నుంచి వచ్చే బూడిద వ్యర్థాలకు పంట చేలు రంగు మారడంతో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. దీంతో రైతులు పండించిన పంటను తీసుకువచ్చి మిల్లు ఎదుట ధాన్యాన్ని పోసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వము స్పందించి రైతులు పండించిన పంటను మిల్లర్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రభుత్వం చర్యలు తీసుకోవాలిః**
**రైతు ఆంజనేయులు అన్నపరెడ్డిగూడెం**



రైతులు కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం ఎటువంటి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మిల్లర్లను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రతి ఏటా మిల్లర్లు సిండికేట్ గా మారి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతోరైతులు నష్టపోతున్నారు. దీనికి తోడు కొన్ని రైస్ మిల్లుల యాజమాన్యం ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా బయటి ప్రాంతాల నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటూ స్థానికంగా రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వము స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

## మెదక్ జిల్లాలో 68 పరీక్షా కేంద్రాలు

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

హాజరుకానున్నా10,300 మంది విద్యార్థులు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు




**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పదవ తరగతి పరీక్షల కోసం జిల్లాలో 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో 10,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పది పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేశారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 వ తేదీ సోమవారం నుంచి ఏప్రిల్ 2 వ తేదీ దాకా నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్నాయి. జిల్లాలో మొత్తం విద్యార్థులు 10,300 మంది విద్యార్థులు పరీక్షలు రాసే అవకాశం ఉంది.జిల్లాలోని మొత్తం 68 సెంటర్ లలో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు పరీక్ష సమయానికంటే గంట ముందే చేరుకోవాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురావద్దని అధికారులు సూచించారు.

పరీక్షలకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

జిల్లాలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్ కు రెండు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా నేత్రంతో పర్యవేక్షణ చేయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగు నీటి వసతి సౌకర్యం, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వైద్య సిబ్బంది వద్ద మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా పెట్టుకోవాలని, పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్టీసీ బస్ లను సమయానుకూలంగా నడిపించాలని, విద్యుత్ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా విద్యాధికారి రాదా కిషన్ సంబంధిత అధికారులను సూచించారు. పరీక్ష పత్రాలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలు ఉండాలని పది పరీక్షలను పటిష్ట పర్యవేక్షణ నడుమ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## త్వరలో రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహం

రానారే సేవ సంస్థ వెల్లడి



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి ప్రతినిధి:** భారత దేశంలోనే ప్రప్రథమంగా కీ.శే.రావి నారాయణ రెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడానికి భువనగిరి జ్యోత్స్న వేసిన విగ్రహ నమూనాను ఏకగ్రీవంగా అంగీకరించడం ఆనందంగా ఉందని రావి నారాయణ రెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాసు అన్నారు. భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామములో ఆదివారం రావి నారాయణ రెడ్డి సేవా సంస్థ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్య భారత దేశ పార్లమెంటును 1952 సం.లో రావి నారాయణ రెడ్డి ప్రారంభించారని అన్నారు. తెలంగాణ బిడ్డ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మొట్ట మొదటి భారత సార్వత్రిక ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజారిటి పొందిన వ్యక్తిగా నిలిచారని చెప్పారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను పణంగా పెట్టి సాయుధ పోరాటం చేసి తన వారసత్వ స్వంత ఐదు వందల ఎకరాల భూమిని సైతం నిరుపేదలకు దానం చేసిన మహా మనిషని అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన పాటించి పోరాడిన వ్యక్తిగా హరిజన సేవా సంఘ్ సెక్రటరీగా వంద పాఠశాలలని ప్రారంభించిన మహా వ్యక్తి పద్మ విభూషన్ అయిన రావి నారాయణ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా వాసి బొల్లేపల్లి గ్రామం కావడం మన అదృష్టం అని అన్నారు. ఆయన జ్ఞాపకార్థంగా గౌరవార్థంగా రాష్ట్రంలో ఎక్కడ కూడా ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన చిహ్నాలు, విగ్రహాలు లేవని జూన్ 4 రానారె జన్మ దిన సందర్భంగా నిలువెత్తు విగ్రహ ఏర్పాటు ఆవిష్కరణ వాయిదా పడిందని తెలియజేశాడు. రానారె పూర్తి ఫొటో కుటుంబ సభ్యుల దగ్గర కానీ, ఆన్ లైన్లో కాని లభించనందున, జ్యోత్స్న తాను చిన్నప్పుడు చూసిన జ్ఞాపకంతో, కుటుంబ సభ్యుల దగ్గర లభించిన ఛాతీ వరకు ఉన్న ఫోటోల ఆధారంగా ముఖ, శరీర, దోవతి, చేతి కర్ర , పాదాల ఆకృతిని చేతితో చిత్రించారని ఆ చిత్రానికి, రానారె గారి సమకాలికుల సలహాల, సూచనల ద్వారా మార్పులు చేర్పుల తర్వాత తుది మెరుగులు దిద్ది చిత్రం వేసారని వివరించారు. భావి తరాలకు స్ఫూర్తి దాయకంగా ఉండేందుకు, ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని బొల్లేపల్లి గ్రామంలో ప్రప్రథమంగా ఏర్పాటు అంగీకార తీర్మానం చేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రానారె సేవా సంస్థ ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్, సెక్రటరి రావి సుకేష్ రెడ్డి, కోశాధికారి దాసు వేంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారు భువనగిరి సత్యనారాయణ, సలహాదారు రావి ప్రభాకర్ రెడ్డి, సభ్యులు చెరుకుపల్లి మహేశ్, రావి హేమంత్ రెడ్డి, సీలోజు రాజలింగం, లక్ష్మణచారి, మద్ది బుచ్చి రెడ్డి మాజీ సర్పంచ్, గడ్డమీద వీరయ్య, కొండ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాలలో భాగంగా ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మి నిర్వహకులుగా వ్యవహరించారు. మొదటి సమావేశంలో చిమమండన్గోజీ అడిచే గ్రంథాన్ని డాక్టర్ అంపశయ్య నవీన్ ఆవిష్కరించి మాట్లాడుతూ అన్ని విషయాలలో స్త్రీలు, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలని, అందరూ ఇలాంటి పుస్తకాలు చదివితే వారి అభిప్రాయాలు మారుతాయని అన్నారు. ఈ పుస్తకాన్ని మెట్టు రవిందర్ పరిచయం చేశారు. రెండవ సమావేశంలో తమ్మెర రాధిక హవేళి దొరసాని కథా సంపుటిని బివి ఎన్ స్వామి ఆవిష్కరించి మాట్లాడారు.ఈ పుస్తకాన్ని మాలవీలత పరిచయం చేశారు. మూడవ సమావేశంలో భారత దేశంలో వితంతు వ్యవస్థ అనే గ్రంథాన్ని తిరునగరి దేవకీ దేవి ఆవిష్కరించి దేశంలో వితంతు పరిస్థితులను వివరించగా తెన్నేటి విజయచంద్ర పుస్తకాన్ని పరిచయం చేశారు. నాలుగవ సమావేశంలో తమ్మెర రాధిక మరొక గ్రంథం కాలం జాడలు తీస్తూ కవితా సంపుటిని పొట్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించి మాట్లాడగా పుస్తకాన్ని చంద్రకళ పరిచయం చేశారు.ఐదవ సమావేశంలో అనిశెట్టి రజిత కలం కాన్వాస్ మీద కవితా సంపుటిని శీఆర్ విద్యార్థి ఆవిష్కరించి మాట్లాడగా సింగరాజు రమాదేవి పుస్తక పరిచయం చేశారు. ఈ సమావేశాలలో నాగిళ్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య,అరసం రాష్ట్ర,జిల్లా నాయకులు పల్లేరు వీరస్వామి, నిధి, వల్లంపట్ల నాగేశ్వర్ రావు,బి.రమాదేవి,బిల్లా మహేందర్, నేరెళ్ల శ్రీనివాస్ సందేశలు ఇవ్వగా బండారి సుజాత,అంజనీ దేవి, శ్యామల,శోభారాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల్లో బిసిలకు అన్యాయం : జాజుల

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయం జరిగి ప్రజాపాలన జరుగుతుందనుకుంటే ఈ ప్రభుత్వంలో కూడా మెజార్టీగా ఉన్న బీసీలకు అన్యాయమే జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 37 కార్పొరేషన్ ఛైర్మన్‌లలో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 13 కార్పొరేషన్ ఛైర్మన్లు మాత్రమే కేటాయించిందని, అగ్ర కులాలనికి చెందిన వారికి 17 కార్పొరేషన్ ఛైర్మన్లు కేటాయించారని ఆరోపించారు. కేవలం ఒకే కులానికి మాత్రమే పదవులు ఇస్తే ప్రజాపాలన అవుతుందా అని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఒంటెద్దు పోకడలను మానుకోవాలని, లేనట్లయితే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మూల్యం తప్పదన్నారు.

## గ్యారంటీ ధనవంతులకే...

(మొదటి పేజీ తరువాయి)

పేరులోని ‘గాంధీ’ అంటేనే బిజెపి భయపడుతున్నదని వ్యాఖ్యానించారు. కాగా, తన భర్త, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌ను అన్యాయంగా కేసుల్లో ఇరికించి జైలుపాలు చేశారని ఆయన భార్య కల్పన ఆరోపించారు. ఈ ర్యాలీలో తొలుత మాట్లాడిన డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఎలక్టోరల్ బాండ్ల పథకంపై విమర్శనాస్త్రాలు గుప్పించారు. ఆ పథకాన్ని వైట్ కాలర్ అవినీతిగా పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో మోడీ రెండే రెండు పనులు చేశారని, వాటిలో మొదటికి విదేశీ యానాలుకాగా, రెండోది తప్పుడు ప్రచారాలని స్టాలిన్ ఎద్దేవా చేశారు. బిజెపి మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

రాజ్యాంగాన్ని మార్చేంత ధైర్యం బిజెపికి లేదు : రాహుల్ గాంధీ

అంతకు ముందు భారత్ జోడో న్యాయ యాత్ర ముగింపు సందర్భంగా ముంబయిలో నిర్వహించిన సభలో రాహుల్ మాట్లాడుతూ బిజెపి ఎంతో హడావుడి చేస్తుంది కానీ, రాజ్యాంగాన్ని మార్చేంత ధైర్యం ఆ పార్టీకి లేదనిన్నారు. రాజ్యాంగ సవరణ చేయాలంటే పార్లమెంటు ఉభయ సభల్లో బిజెపికి మూడోవంతు మెజార్టీ అవసరమని ఆ పార్టీ ఎంపి అనంత్‌కుమార్ హెగ్డే ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ ఈ విధంగా స్పందించారు. ‘సత్యం, ప్రజల మద్దతు మన వైపే ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతోన్న పోరు బిజెపి, కాంగ్రెస్ మధ్య కాదు. రెండు సిద్ధాంతాల మధ్య పోటీ ఇది. అధికారం మొత్తం ఒకే దగ్గర ఉండాలని వాళ్లు అనుకుంటే.. అధికార వికేంద్రీకరణ ఉండాలని మేం భావిస్తాం. రైతులు, కార్మికులు, నిరుద్యోగులకు జ్ఞానం ఉండదని కాషాయ శ్రేణులు విశ్వసిస్తాయి. ఓ వ్యక్తి ఐఐటి డిగ్రీ పొందినంత మాత్రాన, అతడు రైతు కంటే ఎక్కువ తెలివైనవాడని కాదు’ అని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. మణిపూర్ నుంచి మొదలైన భారత్ జోడో న్యాయ యాత్ర మార్చి 16న సాయంత్రం ముంబయిలోని బి.ఆర్.అంబేద్కర్ సార్మక చైత్యభూమికి చేరుకోవడంతో ముగిసింది. 63 రోజుల పాటు ఇది కొనసాగింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : K Sreenivas Reddy,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com